

రాష్ట్ర బంద్‌ను విజయవంతం చేయాలి

- బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు సాధించే వరకు ఉద్యమించాలి
- కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోరాడాలి
- మావోయిస్టు పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి జగన్

6



పేదల కలలు సాకారం చేయడమే లక్ష్యం

- అర్హులైన వారికి విడతల వారీగా ఇందిరమ్మ ఇళ్లు
- లబ్ధిదారు గృహప్రవేశం కార్యక్రమంలో మంత్రి సీతక్క



వెంకటాపూర్‌లో ఇందిరమ్మ ఇంటిని ప్రారంభిస్తున్న మంత్రి సీతక్క

వెంకటాపూర్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): పేదల కలలను సాకారం చేయడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర పంచాయతీరాజ్, స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి సీతక్క అన్నారు. ములుగు జిల్లా వెంకటాపూర్ మండల కేంద్రంలోని బీసీ కాలనీలో లబ్ధిదారు బయ్య ప్రమీల ఇందిరమ్మ ఇంటిని మంత్రి గురువారం ప్రారంభించారు. పాలు పొంగించి గృహప్రవేశం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పేదల ఇంటి కలను సాకారం చేసి వారి జీవితాల్లో వెలుగులు నింపుతామన్నారు. అర్హులైన వారికి విడతల వారీగా ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తామన్నారు. కాంగ్రెస్ నేతృత్వంలోని ప్రజా ప్రభుత్వమే నిజమైన రైతుకూలీలకు అండగా నిలుస్తోందని తెలిపారు. రైతును రాజుగా చూడాలనే సంకల్పంతోనే సన్న వరిధాన్యం క్వింటాల్‌కు రూ.500 బోనస్ ఇస్తున్నామని తెలిపారు. తొమ్మిది నెలల వ్యవధిలోనే రూ.21 వేల కోట్లతో రూ.2 లక్షలలోపు ఉన్న రైతుల రుణమాఫీ చేసినట్టు తెలిపారు. రూ.22,500 కోట్లతో 4.5 లక్షల ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేసినట్టు పేర్కొన్నారు. మూడు విడతల్లో అర్హులైన ప్రతి పేద కుటుంబానికీ ఇల్లు కట్టించేందుకు చర్యలు చేపట్టామని పేర్కొన్నారు. అలాగే 7 లక్షల కొత్త రేషన్‌కార్డులు జారీ చేయడం, 17లక్షల పాత రేషన్ కార్డుల్లో కొత్త సభ్యుల పేర్లు నమోదు చేయడం వంటి సంక్షేమ కార్యక్రమాలు కాంగ్రెస్ ప్రభుత్వమే విజయవంతంగా అమలు చేస్తోందని అన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రజా సంక్షేమాన్ని విస్మరించి కేవలం కమీషన్ల కోసం కాళేశ్వరం ప్రాజెక్టుపైనే దృష్టి పెట్టిందని తీవ్రస్థాయిలో విమర్శించారు. పేదల గౌరవప్రదమైన జీవనానికి ప్రతీకగా నిలిచే ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాన్ని పూర్తిగా విస్మరించిందని ఆరోపించారు.

కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు పైడాకుల అశోక్, టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లాడి రాంరెడ్డి, జిల్లా గ్రంథాలయసంస్థ చైర్మన్ బానోత్ రవిచందర్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు బైరెడ్డి భగవాన్‌రెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు చెన్నోజు సూర్యనారాయణ, అధికార ప్రతినిధి బండి శ్రీనివాస్, డీసీసీబీ డైరెక్టర్ మాడుగుల రమేష్, ఎన్ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడు మామిడిశెట్టి కోటి, మేడారం డైరెక్టర్ మిల్కూరి ఐలయ్య, నాయకులు జంగిలి రవి, కూరెళ్ల రామాచారి, చెన్నోజు శ్రీను, తదితరులు పాల్గొన్నారు.



రచ్చ రచ్చ..

అధికార పార్టీలో మళ్లీ 'కొండా' కలకలం

- వరుస సంఘటనలతో రాజకీయాల్లో సంచలనం
- మేడారం టెండర్లలో మంత్రి పొంగులేటితో బయటపడ్డ విభేదాలు
- వరంగల్‌కు వచ్చిన సీఎంకు స్వాగతం పలికేందుకు రాని మంత్రి
- దేవాదాయ శాఖ నుంచి ఆర్‌అండ్‌బీకి మేడారం పనులను మళ్లించిన ప్రభుత్వం
- కొండా ప్రైవేటు ఓఎస్‌డీ సుమంత్ తొలగింపు.. బెదిరింపు కేసులో అరెస్టుకు యత్నం
- రాజకీయాల్లో కాకరేపిన సుస్మిత తీవ్ర వ్యాఖ్యలు
- రంగంలోకి దిగిన అధిష్ఠానం.. కొండా దంపతులతో చర్చలు

▪ ఆంధ్రజ్యోతి ప్రతినిధి, వరంగల్

రాజకీయాల్లో మంత్రి కొండా సురేఖ మళ్లీ హాట్ టాపిక్‌గా మారారు. ఫైర్‌బ్రాండ్ లీడర్లుగా పేరున్న కొండా దంపతులు.. వరుసగా వివాదాల్లో చిక్కుకుంటున్నారు. వారి ప్రైవేటు ఓఎస్‌డీ సుమంత్ తొలగింపు ఎపిసోడ్‌లో మంత్రి సురేఖ, ఆమె కూతురు సుస్మితాపటేల్ వ్యవహారశైలి చర్చనీయాంశంగా మారింది. సుమంత్‌ను అరెస్ట్ చేసేందుకు వచ్చిన పోలీసులతో వాగ్వాదానికి దిగడంతో పాటు మంత్రులపై సుస్మిత చేసిన వ్యాఖ్యలు కాంగ్రెస్‌లో కలకలం రేపుతున్నాయి. అలాగే మంత్రి సురేఖ.. మేడారం టెండర్లలో మంత్రి పొంగులేటి పెత్తనం ఏమిటని ప్రశ్నించటం.. వరంగల్‌కు వచ్చిన సీఎం రేవంత్‌రెడ్డికి స్వాగతం పలికేందుకు రాకపోవటం రాజకీయాల్లో కలకలం రేపింది. సురేఖ తీరుపై గుర్రుగా ఉన్న ప్రభుత్వ పెద్దలు తమదైన రీతిలో 'చర్యలు' తీసుకుంటున్నట్టు కనిపిస్తోంది. మంత్రి సురేఖ ఓఎస్‌డీ సుమంత్‌ను తొలగించటంతో పాటు మేడారంలో దేవాదాయ శాఖ పరిధిలో ఉన్న రూ.101 కోట్ల పనులను ఆర్‌అండ్‌బీకి బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీచేయడం ఒకరకమైన ఝలక్‌గానే భావిస్తున్నారు.

వివాదాల కొండా...

కాంగ్రెస్ ప్రభుత్వంలో బీసీ మహిళగా కొండా సురేఖను సీఎం రేవంత్‌రెడ్డి కేబినెట్‌లోకి తీసుకున్నారు. అయితే మొదటి నుంచి సురేఖకు అప్రాధాన్య శాఖలు ఇచ్చారని భావించారు. సీఎం రేవంత్‌రెడ్డికి సన్నిహితంగా ఉండటంతో మంత్రివర్గ విస్తరణలో కొత్తశాఖలు ఇస్తారని భావించారు. ఈ క్రమంలో పలు సందర్భాల్లో మంత్రి సురేఖ పలువురిపై చేసిన కామెంట్లు వివాదాస్పదంగా మారాయి. సినీహీరో అక్కినేని నాగార్జున కుటుంబంపై చేసిన వ్యాఖ్యలు రాష్ట్రవ్యాప్తంగా కలకలం రేపాయి. ఈ మేరకు ఆమె కోర్టులో కేసును ఎదుర్కొంటున్నారు.

మరోవైపు వరంగల్ జిల్లాలో సైతం సొంత పార్టీ ఎమ్మెల్యేల నుంచి వ్యతిరేకతను ఎదుర్కొన్నారు. రాహుల్‌గాంధీ జన్మదినం సందర్భంగా సురేఖ భర్త, మాజీ ఎమ్మెల్సీ కొండా మురళి... ఎమ్మెల్యేలు కడియం శ్రీహరి, రేవూరి ప్రకాష్‌రెడ్డిలపై చేసిన వ్యాఖ్యలు తీవ్ర చర్చనీయాంశంగా మారాయి. వారిపై ఉమ్మడి వరంగల్‌కు చెందిన ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీతో పలువురు నేతలు అధిష్ఠానానికి ఫిర్యాదులు చేయటం వరకు వెళ్లింది. భద్రకాళి బోనం విషయంలోనూ వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే

(మిగతా 7లో..)

సర్కారు ఝలక్

మంత్రి కొండా సురేఖకు ప్రభుత్వం వరుసగా ఝలక్‌లు ఇచ్చింది. మంత్రి పొంగులేటితో వివాదానికి కారణమైన మేడారం పనులను దేవాదాయశాఖ నుంచి తప్పించి బుధవారం రాత్రి ఆర్‌అండ్‌బీ శాఖకు అప్పగించారు. ఈ మేరకు సీఎస్ రామకృష్ణారావు ఉత్తర్వులు జారీ చేశారు. మేడారం గద్దెల ఆధునీకరణ, ప్రాకారం విస్తరణ, రోడ్ల నిర్మాణం కోసం దేవాదాయశాఖకు అప్పగించిన రూ.101కోట్ల పనులు నిర్వహించేందుకు దేవాదాయశాఖ వద్ద సాంకేతికత లేనందున ఆర్‌అండ్‌బీ అప్పగిస్తున్నట్లు ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. అలాగే మంత్రి సురేఖ ఓఎస్‌డీగా పని చేస్తున్న సుమంత్‌ను మంగళవారం రాత్రి అకస్మాత్తుగా ప్రభుత్వం తొలగించింది. పర్యావరణ శాఖలో ఔట్‌సోర్సింగ్ ఉద్యోగిగా ఉన్న సుమంత్‌ను తొలగించి సురేఖకు ప్రభుత్వం ఝలక్ ఇచ్చింది. ఈ సంఘటన నుంచి తేరుకోకముందే బుధవారం రాత్రి హైదరాబాద్‌లోని మంత్రి సురేఖ నివాసం వద్ద మఫ్టీ పోలీసులు సుమంత్‌ను అరెస్ట్ చేసేందుకు రావడం రాజకీయంగా తీవ్ర కలకలం రేగింది. సురేఖ తన కారులో సుమంత్‌ను బయటకు తీసుకెళ్లటం, సురేఖ కుమార్తె సుస్మిత చేసిన వ్యాఖ్యలు మరింత అగ్గిరాజేస్తున్నాయి. రెడ్డి వర్గం నేతలు తమను అణగదొక్కాలని చూస్తున్నారని సుస్మిత ఆరోపించారు.



దేవస్థానం ప్రాంగణంలో జరుగుతున్న పనులు

మేడారంలో ముమ్మరంగా అభివృద్ధి పనులు

తాడ్వాయి, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): ములుగు జిల్లా తాడ్వాయి మండలం మేడారంలో మాస్టర్ ప్లాన్‌లో భాగంగా అభివృద్ధి పనులు ముమ్మరం అయ్యాయి. గోవిందరాజు, పగిడిద్దరాజు గద్దెల స్థలాల మార్పు పనులు గురువారం ప్రారంభమయ్యాయి. బేస్‌మెంట్ నిర్మాణ పనులు మొదలయ్యాయి. అదేవిధంగా దేవస్థానం పరిసరాల్లో ప్రాకారం, విస్తరణ పనులు ప్రారంభమయ్యాయి. 90 రోజుల్లో పనులు పూర్తి చేయాలని మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఆదేశించిన నేపథ్యంలో ఊపందుకున్నాయి.



దేవస్థానం పరిసరాల్లో తొలగిస్తున్న భారీ వృక్షాలు

విద్యుత్ షాక్‌తో కౌలు రైతు మృతి



సంఘటన స్థలంలో తిరుపతి మృతదేహం

కృష్ణకాలనీ, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ షాక్‌తో కౌలు రైతు మృతి చెందిన సంఘటన భూపాలపల్లి జిల్లా ఆజంనగర్‌లో బుధారం చోటుచేసుకుంది. మృతుడి కుటుంబ సభ్యులు, గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం..భూపాలపల్లి మండల పరిధి ఆజంనగర్‌కు చెందిన కారుకూరి తిరుపతి (25) అదే గ్రామంలో ఎకరం భూమిని కౌలుకు తీసుకొని వ్యవసాయం చేస్తున్నాడు. రోజు వారీ పనుల్లో భాగంగా ఉదయం పొలం వద్దకు వెళ్లిన అతడు మోటార్ ఆన్ చేయడానికి స్విచ్ ఆన్ చేస్తుండగా విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందాడు. సంఘటన స్థలాన్ని పోలీసులు పరిశీలించి మృతదేహాన్ని పరిశీలించి పోస్టుమార్టం నిమిత్తం భూపాలపల్లి వంద పడకల ఆస్పత్రికి తరలించారు. మృతుడికి భార్య, ఒక కుమారుడు ఉన్నారు.

మధుసూదనాచారి మార్నింగ్ వాక్

- వాకర్స్, పారిశుధ్య కార్మికులతో మాటామంతీ
- పార్క్ సమస్యలపై సింగరేణి జీఎంకు ఫోన్‌కాల్

కృష్ణకాలనీ, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): భూపాలపల్లిలోని జయశంకర్ పార్కులో మండలి ప్రతిపక్ష నేత, ఎమ్మెల్సీ సిరికొండ మధుసూదనాచారి గురువారం మార్నింగ్ వాక్ చేశారు. తోటి వాకర్స్‌తో మాటామంతీ చేశారు. పలు సమస్యలపై వారితో చర్చించారు. పార్కులో నెలకొన్న సమస్యలపై సింగరేణి జీఎంతో ఫోన్‌లో చర్చించారు. పార్కులో చెడిపోయిన పరికరాలకు మరమ్మతులు చేపట్టాలని అన్నారు. అలాగే జయశంకర్ విగ్రహం సమీపంలో సింగరేణి, మునిసిపల్ కార్మికులతో కలిసి మధుసూదనాచారి టీ తాగారు. వారితో కాసేపు ముచ్చటించారు. సమస్యలేమైనా ఉన్నాయా? అని అడిగి తెలుసుకున్నారు. గతంలో తాను ఉన్న సమయంలో వేసవిలో కార్మికులకు మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ చేయించినట్టు గుర్తు చేశారు.



పార్కులో వాకింగ్ చేస్తున్న సిరికొండ మధుసూదనాచారి

క్రీడాభివృద్ధిపై ప్రత్యేక దృష్టి

ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు

క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు



భూపాలపల్లిటౌన్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): క్రీడాభివృద్ధిపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టిసారించిందని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. భూపాలపల్లి పట్టణంలోని అంబేడ్కర్ క్రీడా మైదానంలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి క్రీడా పోటీలు గురువారం ప్రారంభమయ్యాయి. ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడు జయపాల్ అధ్యక్షత వహించగా ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే క్రీడలను ప్రారంభించారు. గత ప్రభుత్వాలు విద్యపై నిర్లక్ష్యం చేస్తే ప్రస్తుత సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వం చదువుతో పాటు క్రీడలపై కూడా ప్రత్యేక దృష్టి సారించారని అన్నారు. క్రీడాకారులకు ప్రత్యేక యూనివర్సిటీని తీసుకొచ్చారని తెలిపారు ఎన్నడూ లేని విధంగా క్రీడల కోసం నిధులు వెచ్చిస్తున్నారన్నారు. గ్రామ స్థాయిలో క్రీడాకారులను ప్రోత్సహించి జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిలో రాణించేలా ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. హాస్టళ్లలో సౌకర్యాలను మెరుగుపరచడమే కాకుండా విద్యార్థులకు మెస్, కాస్మోటిక్ చార్జీలు పెంచి ఇస్తోందని తెలిపారు. పేద విద్యార్థులకు ఉన్నత చదువులు అందాలనే సంకల్పంతో ప్రతి నియోజకవర్గానికీ రూ.200 కోట్లు వెచ్చించి ఇంటిగ్రేటెడ్ స్కూల్‌ను ఏర్పాటు చేస్తోందని అన్నారు. కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ విజయలక్ష్మి, డీఈవో రాజేందర్, ఎంఈవో దేవానాయక్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ కోట రాజబాబు, యువజన క్రీడల శాఖ అధికారి రఘు, మాజీ కౌన్సిలర్లు శిరుప అనిల్, ముంజాల రవీందర్, వర్కింగ్ ప్రెసిడెంట్ పిప్పాల రాజేందర్, నాయకుడు అంబాల శ్రీనివాస్, పీఈటీల అధ్యక్షుడు రమేష్, లింగన్న, సరస్వతి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉత్తమ అవార్డు గ్రహీతలైన పీఈటీలను సన్మానించారు.



స్థూపాన్ని ఆవిష్కరించి కొబ్బరికాయ కొడుతున్న ఎస్పీ కిరణ్‌ఖరే

ఎస్పీ కార్యాలయంలో అమరవీరుల స్థూపం ఆవిష్కరణ

కృష్ణకాలనీ, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని ఎస్పీ కార్యాలయంలో పోలీసు మరవీరుల స్థూపాన్ని ఎస్పీ కిరణ్‌ఖరే గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అమరుల త్యాగాలను స్మరించుకుంటూ పోలీసు సిబ్బంది ప్రజల రక్షణలో కట్టుబడి పనిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అడిషనల్ ఎస్పీ నరేష్‌కుమార్, భూపాలపల్లి డీఎస్పీ సంపత్‌రావు, కాటారం డీఎస్పీ సూర్యనారాయణ, జిల్లా పరిధిలోని సీఐలు, ఎస్సైలు సిబ్బంది పాల్గొన్నారు.

యువతిపై దాడి చేసి నగదు చోరీ

జనగామ రూరల్, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): యువతిపై దాడి చేసి రూ.20వేల నగదు చోరీ చేసిన ఘటన జనగామ మండలం చౌడారంలో గురువారం మధ్యాహ్నం చోటు చేసుకుంది. సీఐ సత్యనారాయణరెడ్డి, ఎస్సై భరత్ ఘటనా స్థలానికి చేరుకొని విచారణ చేపట్టారు. సీఐ సత్యనారాయణ కథనం ప్రకారం.. చౌడారానికి చెందిన దంపతులు పనినిమిత్తం వేరే ఊరికి వెళ్లారు. ఇంట్లో ఇంటర్ చదువుతున్న కూతురు ఉండగా, ఇద్దరు గుర్తు తెలియని వ్యక్తులు ప్రవేశించి బీరు సీసాలతో దాడి చేసి బీరువాలో ఉన్న రూ.20వేలను అపహరించారు. ఈ దాడిలో యువతికి స్వల్ప గాయాలయ్యాయి. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ తెలిపారు.

పహల్గామ్‌లో బతుకమ్మ ఆడిన మహిళలకు ఎమ్మెల్సీ కవిత సన్మానం



ఎమ్మెల్సీ కవితతో బాలాజీ టూర్ గ్రూపు సభ్యులు

జనగామ కల్చరల్, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): క్లిష్ట పరిస్థితుల్లో జమ్మూ-కాశ్మీర్‌లోని పహల్గామ్‌లో బతుకమ్మ ఆడిన మహిళలను ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత గురువారం సన్మానించారు. జనగామలోని బాలాజీ టూర్ గ్రూప్ మహిళలు గతనెల పహల్గామ్‌ను సందర్శించి బతుకమ్మ పండుగ నేపథ్యంలో అక్కడి పూలను సేకరించి బతుకమ్మ ఆడారు. ఈనెల 15న గ్రూపు సభ్యులు ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితను హైద్రాబాద్‌లోని ఆమె నివాసంలో మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. గ్రూపు సభ్యులకు తెలంగాణ రుచులతో వంటకాలను సిద్ధం చేసిన కవిత వారితో కలిసి సహపంక్తి భోజనం చేశారు. కార్యక్రమంలో బుర్ర లలిత రమేష్, శివగారి రజిని కిరణ్‌కుమార్, మరియాల మంజుల రమేష్, పాశికంటి సుజాత యాదగిరి, భోంపల్లి సుజాత సంతోష్, పద్మ గుణవర్ధన్, బుక్క రుక్మిణి ప్రవీణ్ పాల్గొన్నారు.

తెలుగు ప్రజల కోసం ప్రత్యేక పర్యాటక రైలు

వడ్డెపల్లి, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): భారతీయ రైల్వే అనుబంధ సంస్థ ఐఆర్‌సీటీసీ ఆధ్వర్యంలో తెలుగు ప్రజల కోసం ప్రత్యేక పర్యాటక రైలు (భారత్ గౌరవ్ రైలు)ను అందుబాటులోకి తెచ్చినట్లు ఐఆర్‌సీటీసీ సౌత్ సెంట్రల్ జోన్ అసిస్టెంట్ మేనేజర్ పీవీ వెంకటేష్ తెలిపారు. గురువారం హనుమకొండ బాలసముద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ రైలు యాత్ర ఈ నెల 26 నుంచి నవంబరు 4 వరకు ఉంటుందని పేర్కొన్నారు. యాత్రలో భాగంగా ద్వారకాదీష్ మందిరం, నాగేశ్వర జ్యోతిర్లింగ మందిరం, బేట్ ద్వారక, సోమనాథ్ జ్యోతిర్లింగ మందిరం, సబర్మతి ఆశ్రమం సందర్శన, సూర్య దేవాలయం, రాణికి వావ్, స్టాచ్యూ ఆఫ్ యూనిటీ (సర్దార్ వల్లభాయ్ పటేల్ విగ్రహం) సందర్శించవచ్చని తెలిపారు. వివరాలకు ఫోన్ నంబర్లు 97013 60701/ 98810 30711లలో సంప్రదించాలని కోరారు. సమావేశంలో సంస్థ ప్రతినిధులు సతీష్, నరేష్‌బాబు పాల్గొన్నారు.

రామప్ప ఖ్యాతిని ప్రపంచానికి చాటిచెప్పాలి

పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క
వరల్డ్ హెరిటేజ్ క్యాంపు సందర్శన



వలంటీర్లను ఉద్దేశించి మాట్లాడుతున్న మంత్రి సీతక్క

వెంకటాపూర్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): రామప్ప ఖ్యాతిని ప్రపంచానికి చాటి చెప్పాలని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, స్త్రీ, శిశు సంక్షేమశాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క అన్నారు. ములుగు జిల్లా వెంకటాపూర్ మండలంలోని పాలంపేటలో ఉన్న హరిత కాటేజ్‌లో నిర్వహిస్తున్న వరల్డ్ హెరిటేజ్ వలంటీర్ క్యాంపును గురువారం మంత్రి సందర్శించారు. ఈ సందర్భంగా వలంటీర్లతో మాట్లాడి వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మంత్రి సీతక్క మాట్లాడుతూ తన జీవితంలో ఏ విధంగా ఈ స్థితికి వచ్చాను.. ఇక్కడున్న ప్రాంత ప్రాముఖ్యత గురించి తెలుసుకోడానికి వచ్చిన అందరికీ అభినందనలు తెలిపారు. ఇక్కడ నేర్చుకున్న ప్రతీ అంశంపై మీ ప్రదేశాల్లో కాకతీయుల గురించి వివరించాలన్నారు. ప్రొఫెసర్ పాండురంగారావు మాట్లాడుతూ వరుసగా నాలుగోసారి వరల్డ్ హెరిటేజ్ వలంటీర్ క్యాంపు నిర్వహించడం జరుగుతుందని, ప్రతీ సంవత్సరం వివిధ దేశాల నుంచి విద్యార్థినీవిద్యార్థులు వచ్చి కాకతీయుల కళాసంపద, వారసత్వం, వాటిని ఎలా కాపాడుకోవడం అనే అంశాలపై, వాటి ప్రాముఖ్యతను తెలుసుకుంటున్నారని అన్నారు. అసిస్టెంట్ టూరిజం ప్రమోషన్ ఆఫీసర్ డాక్టర్ కుసుమ సూర్యకిరణ్ మాట్లాడుతూ పర్యాటక రంగం ప్రజలకు ఏ విధంగా దోహదపడుతుందో వివరించారు. శిక్షణలో భాగంగా ప్రొఫెసర్ వెంకటొరెడ్డి, ఎన్ఐటీ నుంచి వచ్చిన జాగ్రాఫికల్ ఇన్ఫర్మేషన్ సిస్టంపై, సమ్మక్క-సారలమ్మ ట్రైబల్ యూనివర్సిటీ వైస్ చాన్సలర్ వైఎల్.శ్రీనివాస్‌లు వలంటీర్లకు టూరిజం కల్చరల్ హెరిటేజ్‌పై పలు సూచనలు, సలహాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో వలంటీర్లు పాల్గొన్నారు.



అరుదైన నల్లరెక్కల గద్ద

వాజేడులో అరుదైన పక్షి

వాజేడు, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): మండలంలో గురువారం అరుదైన పక్షి కనిపించింది. మండలంలోని గుమ్మడిదొడ్డిలో ఓ రైతు పొలం వద్ద ఈ పక్షి స్థానికుల కంట పడింది. వింత ఆకారంలో ఉన్న పక్షి పేరు బ్లాక్ వింగ్‌డ్ కైట్(నల్లరెక్కల గద్ద).. దీనిని శాస్త్రీయంగా ఎలానస్ కెరులస్ అని పిలుస్తారని నిపుణులు తెలిపారు. స్థానికులు మాత్రం అడవి రామదాసు అని పిలుస్తారని పేర్కొన్నారు. ఈ పక్షి కల్లు చూడటానికి ఎర్రగా ఉంటాయి. కాళ్లు పసుపు వర్ణంలో రెక్కలు పెద్దగా ఉన్నాయి. చూడటానికి పావురంలా అనిపించినా బలమైన పక్షిలా ఉంటుందని స్థానికులు తెలిపారు. ఎలుకలు, చిన్న పక్షులు, పురుగులు దీని ఆహా రంగా తీసుకుంటుందని నిపుణులు తెలిపారు. దేశంలో అరుదుగా మాత్రమే ఈ పక్షలు కనిపిస్తాయని పలు వురు తెలిపారు. ఈ పక్షిని చూసేందుకు స్థానికులు ఆసక్తి చూపారు.

కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించాలి

జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి



ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే పల్లా

నర్మెట, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించి, మద్దతు ధర పొందాలని ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి రైతులకు సూచించారు. గురువారం హన్మంతాపూర్‌లో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్యే చేర్యాల మార్కెట్ కమిటీ చైర్మన్ నల్ల నాగుల శ్వేతతో కలిసి ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని సిబ్బందిని ఆదేశించారు. కేంద్రం వద్ద విద్యుత్ లైట్లు ఏర్పాటు చేయాలని నిర్వాహకులు ఎమ్మెల్యేను కోరగా, సంబంధిత అధికారులతో మాట్లాడుతానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో అడిషనల్ డీఆర్డీవో నూరోద్దిన్, తహసీల్దార్ మొహసీన్ ముజ్జబా, ఏపీఎం ప్రమీల, డీసీసీ అధ్యక్షుడు గంగం నర్సింహరెడ్డి, మాజీ ఎంపీపీ తేజావత్ గోవర్ధన్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు చింతకింది సురేష్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు రాజబోయిన లక్ష్మీనారాయణ, మార్కెట్ డైరక్టర్లు ఏసళ్ల అంజయ్య, లక్ష్మి, కాంగ్రెస్, బీఆర్ఎస్ నాయకులు, సీసీలు శంకర్, శ్రీనివాస్, ఉమాదేవి నిర్వాహకులు పాల్గొన్నారు.

ఉమ్మడి వరంగల్ జిల్లా బాలికల కరాటే పోటీలు

ములుగు రూరల్, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): ములుగులోని బండారుపల్లి రోడ్డులో ఉన్న గిరిజన భవన్‌లో ఉమ్మడి వరంగల్ జిల్లా అండర్ 14, 17 బాలికల కరాటే పోటీలు గురువారం జరిగాయి. ములుగు ఎంఈవో వజ్జ తిరుపతి, ఎస్సై వెంకటేశ్వర్లు ఈ పోటీలను పరిశీలించారు. బాలికలకు ఆత్మరక్షణ కోసం నేటి సమాజంలో కరాటే అవసరమన్నారు.. ఇక్కడ ప్రతిభ కనబర్చిన విద్యార్థినులు రాష్ట్ర స్థాయిలో ప్రథమ స్థాయిలో నిలవాలని ఆకాంక్షించారు. ఈ పోటీలకు ఉమ్మడి జిల్లా నుంచి 250 మంది విద్యార్థినులు, 50 మంది కోచ్‌లు హాజరయ్యారు.

భూ నిర్వాసితులకు నష్టపరిహారం చెల్లించాలి

తాడ్వాయి, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): మండలంలోని మేడారం సమ్మక్క- సారలమ్మల మహాజాతర అభివృద్ధి పనులలో భాగంగా కొనసాగుతున్న రహదారుల విస్తరణ పనులకు భూమి కోల్పోతున్న రైతులకు నష్టప రిహారం చెల్లించాలని రైతులు, పలు సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఈ క్రమంలో గురువారం ఆంధ్రజ్యోతితో రైతుల ఆవేదన వ్యక్తం చేశారు. అభివృద్ధి పేరుతో స్థానిక రైతులకు నష్టం వాటిల్లే పనులు చేపట్టవదని అన్నారు. కనీస సమాచారం లేకుండా భూములు గుంజుకునే ప్రయ త్నం అధికారులు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే తహసీల్దార్ సర్వే నిర్వహించి భూములు కోల్పోతున్న రైతులకు నష్టపరిహారం చెల్లించేలా ఏర్పాట్లు చేయాలని డిమాండ్ చేశారు. ఎలాంటి సమాచారం లేకుండా రైతుల భూ ముల్లో రోడ్ల విస్తరణ అభివృద్ధి పనులు చేపడితే నిర్వాసిత రైతులు ఆందోళనలకు దిగాల్సి వస్తుందన్నారు.

తెలంగాణ బంద్‌ను విజయవంతం చేయాలి

● కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోరాడాలి ● మావోయిస్టు పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి జగన్



భారత కమ్యూనిస్టు పార్టీ(మావోయిస్టు)
తెలంగాణ రాష్ట్ర కమిటీ

మావోయిస్టు నేత జగన్ విడుదల చేసిన లేఖ

ఏటూరునాగారం, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల్లో 42 శాతం రిజర్వేషన్ల సాధనలో భాగంగా ఈనెల 18న తలపెట్టిన తెలంగాణ రాష్ట్ర బంద్‌ను విజయవంతం చేయాలని భారత కమ్యూనిస్టు పార్టీ మావోయిస్టు తెలంగాణ రాష్ట్ర కమిటీ పిలుపునిచ్చింది. ఈ మేరకు మావోయిస్టు పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి జగన్ గురువారం ఒక పత్రికా ప్రకటన విడుదల చేశారు. బీసీలకు 42శాతం రిజర్వేషన్లు సాధించే లక్ష్యంతో ఈ నెల 18న జరగబోయే రాష్ట్ర బంద్‌ను జయప్రదం చేయాలని ప్రజలకు, అన్ని పార్టీలకు, సంఘాలకు, ప్రజాస్వామిక వాదులకు, మేధావులకు ఆయన విజ్ఞప్తి చేశారు. ఆర్ఎస్ఎస్, బీజేపీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం మనువాద ఫాసిస్టు నియంతృత్వాన్ని అమలు చేస్తోందని విమర్శించారు. రాజ్యాంగాన్ని పక్కన పెట్టి మనుస్మృతిని, వర్ణ వ్యవస్థ భావాజాలాన్ని ప్రచారం చేస్తోందని జగన్ ఆరోపించారు. ఆదివాసీ, దళిత, వెనుకబడిన కులాల, మైనార్టీల అస్తిత్వాన్ని, సంస్కృతిని, భాషను నిర్మూలించే విధంగా పాలన కొనసాగుతోందని పేర్కొన్నారు. ఆర్ఎస్ఎస్ శతజయంతి సందర్భంగా రూ.100 నాణెం, పోస్టల్ స్టాంపును విడుదల చేయడం స్వతంత్ర పోరాటంలో విద్రోహ పాత్ర పోషించిన ఆర్ఎస్ఎస్ అధికార పీఠంపై అధిష్టించినట్లు స్పష్టమైందని వ్యాఖ్యానించారు.

రాష్ట్ర ప్రభుత్వం స్థానిక సంస్థలలో 42శాతం రిజర్వేషన్ కోరుతూ శాసనసభలో బిల్లును పాస్ చేసి కేంద్రానికి పంపించిందని, జీవో 9 ని కూడా విడుదల చేసిందని ఆయన గుర్తు చేశారు. స్థానిక సంస్థల విషయం రాష్ట్ర పరిధిలోనిదే అయినప్పటికీ, న్యాయపరమైన చిక్కులను అడ్డుపెట్టి సమస్యను పక్కదారి పట్టించే ప్రయత్నాలను అడ్డుకోవాలని జగన్ సూచించారు. ఈ సమస్య పరిష్కారం కోసం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం, ప్రజాప్రతినిధులు కలసి కేంద్రానికి వ్యతిరేకంగా న్యాయపరంగానూ, చట్టాన్ని తెచ్చేందుకు పోరాడాలని పిలుపునిచ్చారు. పార్లమెంట్‌లో చట్టం ద్వారా ఈ సమస్య పరిష్కారం అవుతుందని పేర్కొంటూ, అన్ని పార్టీలు, సంఘాలు, విద్యార్థులు, ప్రజాస్వామికవాదులు, మేధావులు ఐక్యమై ఆరెస్సెస్-బీజేపీ మనువాదులకు వ్యతిరేకంగా గట్టి ప్రజాందోళనను చేపట్టాలని తెలిపారు. నేడు కొనసాగుతున్న కార్పొరేట్ అనుకూల ఆర్థిక పాలసీలు రద్దు చేయబడితేనే మౌలిక సమస్యలు పరిష్కారమవుతాయని జగన్ పేర్కొన్నారు.

పోక్సో చట్టంపై అవగాహన



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న భరోసా టీం సభ్యులు

కన్నాయిగూడెం, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ముప్పనపల్లి వద్ద ఉన్న కేజీబీవీ పాఠశాల, జూనియర్ కళాశా లలో పోలీస్‌శాఖ వారి ఆధ్వర్యంలో భరోసా టీం సివిల్ కానిస్టేబుల్ అనూష ఆధ్వర్యంలో బాల్య వివాహాలు, పోక్సో చట్టం, సైబర్ క్రైంలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా అనూష మాట్లాడుతూ గ్రామాలలో, తెలిసిన వాళ్లలో కాని చిన్న పిల్లలకు వివాహాలు చేస్తే పోలీసు శాఖ డయల్ 100 కు, లేదా 1098, ఉపాధ్యాయులకు తెలియజేయాలన్నారు. ఫోన్లు వాడేట ప్పుడు జాగ్రత్త వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల, కళాశాల ఎస్‌వో అశ్విని తదితరులు పాల్గొన్నారు.

బోర్లగూడెంలో తీజ్ ఉత్సవాలు



సంప్రదాయ నృత్యం చేస్తున్న లంబాడీ మహిళలు

మహాముత్తారం, అక్టోబరు16 (ఆంధ్రజ్యోతి): భూపాలపల్లి జిల్లా మహాముత్తారం మండలంలోని బోర్లగూడెం బాలాజీతండాలో గురువారం తీజ్ ఉత్సవాలను లంబాడీలు ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా యువతులు, మహిళలు ఆడిపాడారు. అనంతరం కుల పెద్దల ఆధ్వర్యంలో మేరమాయాడి, సేవాలాల్ మహరాజ్‌కు పూజలు నిర్వహించారు. ముఖ్య అతిథిగా తహసీల్దార్ డి.శ్రీనివాస్ హాజరయ్యారు. లంబాడీల సంస్కృతీ సంప్రదాయాలు అబ్బుర పరిచేలా ఉంటాయని కొనియడారు. ఈ కార్యక్రమంలో తండా పెద్దలు హట్కర్ శ్రీరామ్‌నాయక్, పూల్‌సింగ్‌నాయక్, శ్రీనివాస్, నవ్‌రాం, రాంలాల్, సీతు నాయక్ తదితరులు పాల్గొన్నారు.

స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటాలి

యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షుడు చీమల సందీప్



సమావేశంలో మాట్లాడుతున్న చీమల సందీప్

కాటారం, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ తరపున పోటీ చేసే అభ్యర్థులను గెలిపించుకొని సత్తాచాటాలని యూత్ కాంగ్రెస్ మంథని నియోజకవర్గ అధ్యక్షుడు చీమల సందీప్ అన్నారు. కాటారం మండలంలోని ధన్వాడలో గురువారం మంథని నియోజకవర్గంలోని తొమ్మిది మండలాల, మంథని పట్టణ యూత్ కాంగ్రెస్ అధ్యక్షులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సందీప్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. గ్రామస్థాయిలో యూత్ కాంగ్రెస్ నూతన కమిటీలను ఏర్పాటు చేసి పార్టీని మరింతగా బలోపేతం చేయాలన్నారు. నియోజకవర్గంలో మంత్రి శ్రీధర్‌బాబు చేపడుతున్న ప్రజాహిత పథకాలను, అభివృద్ధి కార్యక్రమాలను గ్రామస్థాయిలో ప్రజలందరికీ వివరించాలని సూచించారు. ఈ సమావేశంలో యూత్ కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శి బండ కిషోర్, పెద్దపల్లి జిల్లా ప్రధాన కార్యదర్శి నూకల కమల్, మంథని పట్టణ అధ్యక్షుడు పెంటరి రాజు, నియోజకవర్గ పరిధిలోని మండలాల అధ్యక్షులు చీటూరి మహేష్‌గౌడ్, గడ్డం క్రాంతి, రాజ్‌కుమార్, మోత్కూరి అవినాష్, సాదుల శ్రీకాంత్, బక్కతట్ల వినీత్, జాటోత్ వంశీనాయక్, నగేష్‌యాదవ్ పాల్గొన్నారు.

బ్రాయిలర్ ట్రేడర్స్ అసోసియేషన్ ఎన్నిక



బ్రాయిలర్ ట్రేడర్స్ అసోసియేషన్ కార్యవర్గం

ములుగు టౌన్, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): బ్రాయిలర్ ట్రేడర్స్ అసోసియేషన్ ఎన్నికలను ములుగులో గురువారం నిర్వహించారు. జిల్లా అధ్యక్షుడిగా ఏర్ల వెంకన్న, గౌరవ అధ్యక్షుడిగా ఖాజా నసీరుద్దీన్, ఉపాధ్యక్షుడిగా గంగమల్ల విశ్వేశ్వరరావు, ప్రధాన కార్యదర్శిగా గండికోట వెంకటస్వామి, కోశాధికారి గంగమల్ల రత్నాకర్‌రావును ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు వెంకన్న మాట్లాడుతూ బ్రాయిలర్స్ ట్రేడర్స్ సమస్యలను పరిష్కరించడమే కార్యవర్గం ముఖ్యోద్దేశమన్నారు.

రైలులో నుంచి పడి వ్యక్తికి తీవ్రగాయాలు

● రెండు కిలోమీటర్లు స్ట్రెచర్‌పై తీసుకొచ్చిన 108 సిబ్బంది



రైలులో నుంచి పడి గాయపడిన అవినాష్

స్టేషన్‌ఘన్‌పూర్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): ప్రమాదవశాత్తు రైలు నుంచి కిందపడిన వ్యక్తి తీవ్రంగా గాయపడిన ఘటన గురువారం తెల్లవారుజామున స్టేషన్‌ఘన్‌పూర్‌లో చోటుచేసుకుంది. రైల్వే సిబ్బంది కథనం ప్రకారం.. హైదరాబాద్ నుంచి హజరత్ నిజాముద్దీన్ వెళ్తున్న దక్షిణ్ సూపర్ ఫాస్ట్ రైలులో నుంచి మహారాష్ట్రకు చెందిన యువకుడు అవినాష్ ప్రమాదవశాత్తూ స్టేషన్‌ఘన్‌పూర్ రైల్వేస్టేషన్ నుంచి సుమారు రెండు కిలోమీటర్ల దూరంలో ట్రాక్‌పైన పడిపోయాడు. రాత్రి గస్తీ నిర్వహించే సిబ్బంది గమనించి 108కు సమాచారం అందించారు. వారు ట్రాక్ మీదుగా రెండు కిలోమీటర్ల దూరం మేర నడిచివెళ్లి అక్కడి నుంచి నడువలేని స్థితిలో పడిఉన్న అవినాష్‌ను స్ట్రేచర్ తీసుకొచ్చారు. అనంతరం వరంగల్ ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు.

పంటల నమోదు ప్రక్రియ పక్కాగా చేపట్టాలి

మల్హర్, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి) : వానాకాలంలో పంటల నమోదు ప్రక్రియ పక్కాగా చేపట్టాలని వ్యవసాయ శాఖ కమిషనర్ సురేంద్ర మోహన్, డైరెక్టర్ గోపి అన్నారు. హైదరాబాద్ నుంచి గురువారం వారు వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. కార్యక్రమానికి కొయ్యూర్ రైతు వేదిక నుంచి వ్యవసాయ శాఖ జిల్లా అధికారి బాపు, సహాయ సంచాలకులు రమేష్, శ్రీపాల్, ఉద్యాన శాఖ, మార్కెటింగ్ అధికారులు, మండల వ్యవసాయ శాఖ అధికారులు, ఏఈవోలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కమిషనర్, డైరెక్టర్ మాట్లాడుతూ పంట నమోదు ప్రక్రియను ముమ్మరం చేయాలన్నారు. పత్తి అమ్మకానికి కప్పాస్ కాటన్ యాప్ ప్రాధాన్యత, వినియోగం, సమగ్ర వ్యవసాయ యాంత్రీకరణ గురించి వివరించారు.

హోరాహోరీగా
జాతీయ అథ్లెటిక్స్ పోటీలు

హనుమకొండ, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): ఐదో జాతీయ ఓపెన్ అండర్ - 23 అథ్లెటిక్స్ పోటీలు హనుమకొండ జేఎన్ స్టేడియంలో గురువారం ఘనంగా ప్రారంభమయ్యాయి. వరంగల్ ఎంపీ కడియం కావ్య ముఖ్య అతిథిగా హాజరై పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా పది వేల మీటర్ల పరుగు పందెంలో విజేతలైన ముగ్గురు క్రీడాకారిణులకు ఎంపీ కావ్య బంగారం, వెండి, కాంస్య పతకాలను ప్రదానం చేశారు. లతిక తల్వార్ (రాజస్థాన్) గోల్డ్, ఆర్తీ పావురా (మహారాష్ట్ర) సిల్వర్, ముష్రా గౌరీ (మధ్యప్రదేశ్) బ్రాంజ్ మెడల్ సాధించారు. పురుషుల్లో రిజ్వాన్ (ఇండియన్ యూనివర్సిటీ గోల్డ్, సచిన్ యాదవ్ (ఉత్తర్‌ప్రదేశ్) సిల్వర్, శివాజీ కసూర (కర్నాటక) బ్రాంజ్ మెడల్ సాధించారు. జాతీయ స్థాయి ఓపెన్ అథ్లెటిక్ పోటీలకు దేశంలోని అన్ని రాష్ట్రాల నుంచి విచ్చేసిన మహిళ, పురుష క్రీడాకారులతో జేఎన్ఎస్ స్టేడియం సందడిగా మారింది. వివిధ ఈవెంట్లలో అథ్లెట్లు పోటీ పడ్డ తీరు అందరినీ విశేషంగా ఆకట్టుకున్నది. సింథటిక్ ట్రాక్‌పై రేస్‌వాక్‌లో అథ్లెట్లు బుల్లెట్లలా దూసుకుపోయారు.

ఉదయం నుంచే..

పోటీలు ఉదయం 6గంటల నుంచే ప్రారంభమయ్యాయి. రెండు తెలుగు రాష్ట్రాలతో పాటు దేశంలోని అన్ని ప్రాంతాల నుంచి 937 మంది జాతీయ, అంతర్జాతీయ స్థాయి అథ్లెట్లు ఈ పోటీల్లో పాల్గొంటున్నారు అకాడమీలు, నేవీ, ఆర్మీ తదితర సర్వీస్ రంగాలకు నుంచి సైతం అథ్లెట్లు పోటీ పడుతున్నారు. తెలంగాణ రాష్ట్రం నుంచి 17 మంది అథ్లెట్లు పాలుపంచుకుంటున్నారు. రాష్ట్ర అథ్లెటిక్స్ అసోసియేషన్ అధ్యక్షుడు స్టాన్లీ జోన్, నేషనల్ చీఫ్ కోచ్ రాధాక్రిష్ణ, మరో 20 మంది ఇండియన్ టీమ్ కోచ్‌లు, ఒక విదేశీ కోచ్ ఈ పోటీలను పర్యవేక్షిస్తున్నారు. రాష్ట్ర అథ్లెటిక్స్ అసోసియేషన్ చైర్మన్ వరద రాజేశ్వర్ రావు, కార్యదర్శి సారంగపాణి, డీవైఎస్‌వో అశోక్ కుమార్ ఆధ్వర్యంలో జరుగుతున్న ఈ అథ్లెటిక్స్ పోటీల విజయవంతానికి 135 మంది టెక్నికల్ అఫీషియల్స్, కోచ్‌లు సహకారం అందిస్తున్నారు. మూడు రోజుల పాటు జరిగే పోటీలు ఉదయం 6 గంటల నుంచి 10.30 గంటల వరకు ఒక సెషన్, మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5.30గంటట వరకు ఒక సెషన్ చొప్పున జరుగుతాయి. అథ్లెటిక్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (ఎఎఫ్ఐ) నిబంధనల ప్రకారం జరుగుతున్న ఈ పోటీలను తిలకించేందుకు స్టేడియం నలువైపులా ఎల్ఈడీ స్క్రీన్లను ఏర్పాటు చేశారు.

తొలి రోజు విజేతలు

- మెన్స్ 10వేల మీటర్ల పరుగుపందెం: రిజ్వాన్ ప్రథమ స్థానం (ఇండియన్ యూనివర్సిటీ), సచిన్‌యాదవ్ ద్వితీయ స్థానం (ఉత్తరపదేశ్), శివాజి తృతీయ స్థానం (కర్ణాటక).
- ఉమెన్స్ 10వేల మీటర్ల పరుగు పందెం: లతికా తల్వార్ ప్రథమ (రాజస్థాన్), ఆర్తీపవర ద్వితీయ(మహారాష్ట్ర), బుప్రగౌరి తృతీయ స్థానం(మధ్యప్రదేశ్) విజేతలుగా నిలిచారు.
- ఉమెన్స్ షాట్‌పుట్: సిమ్రాన్‌జిత్‌కౌర్ ప్రథమ(ఢిల్లీ), జహల్ ద్వితీయ, (ఉత్తరప్రదేశ్), పూజకుమారి తృతీయ(ఎన్‌సీఓఈ పట్యాల).
- ఉమెన్స్ డిస్కస్‌త్రో: నికితకుమారి ప్రథమ (ఎన్‌సీఓఈ పట్యాల), కిరణ్ ద్వితీయ (రాజస్థాన్), అకిలరాజు తృతీయ (కేరళ).
- మెన్స్ హ్యామార్‌త్రో: దినేష్ ఎస్.ప్రథమ (తమిళనాడు), పవన్ ద్వితీయ (రాజస్థాన్), రాబిన్‌యాదవ్ తృతీయ (ఉత్తరప్రదేశ్).
- ఉమెన్స్ హైజంప్: సీమాకుమారి ప్రథమ (ఉత్తరప్రదేశ్), సారిక్ కుమావట్ ద్వితీయ (రాజస్థాన్), రింపాల్‌కౌర్ తృతీయ (పంజాబ్).
- ఉమెన్స్ లాంగ్ జంప్: ఎం.డి. ముబాసీం ప్రథమ (అంజూబాబి), ఎంఎస్. సించన ద్వితీయ (కర్ణాటక), వీఎం. అబీరామి తృతీయ (కేరళ).
- మెన్స్ 100మీటర్ల పరుగు పందెం: అరుత్యం జయరామ్ ప్రథమ (ఒడిశా), కుమార్ ద్వితీయ (జార్ఖండ్), రాట్ మెల్గే తృతీయ (మహారాష్ట్ర).

జేఎన్ఎస్‌లో ఘనంగా ప్రారంభం

- ఆకట్టుకున్న తొలి రోజు ఈవెంట్లు
- పోటీల్లో పాల్గొంటున్న 900 మందికి పైగా క్రీడాకారులు
- సందడిగా మారిన జేఎన్ఎస్ స్టేడియం

ఈవెంట్లు

మొత్తం 21 ఈవెంట్లలో జాతీయస్థాయి అథ్లెటిక్స్ పోటీలను నిర్వహిస్తున్నారు. పోటీల తొలిరోజు అయిన గురువారం స్త్రీ, పురుషులకు 10వేల మీటర్ల పరుగు, 100, 400, 1500 మీటరు పరుగు, డిస్కస్ త్రో (2.000 కేజీ), డిస్కస్ త్రో (1000 కేజీ) 100 మీటర్ల పరుగు, షాట్‌పుట్ (4.000కేజీ) లాంగ్ జంప్, హైజంప్, హామర్‌త్రో (7.260కేజీ), పోల్ వాల్ట్, షాట్ పుట్-7.260కేజీ (సెక్టార్-1), షాట్ పుట్ (సెక్టార్-2) ఈవెంట్లలో పోటీలు జరిగాయి. 300మందికిపైగా అథ్లెట్లు పోటీ పడ్డారు. కాగా, ఈ పోటీలు హనమకొండలో జరగడం ఇది రెండోసారి. జేఎన్ స్టేడియంలో సింథటిక్ ట్రాక్ నిర్మాణం జరిగిన తర్వాత మొదటిసారిగా ఈ పోటీలు జరుగుతున్నాయి. అంతర్జాతీయ ప్రమాణాలతో రూ.8కోట్ల వ్యయంతో ఏర్పాటు చేసిన సింథటిక్ ట్రాక్ జాతీయ, అంతర్జాతీయస్థాయి క్రీడా పోటీల నిర్వహణకు అనువుగా ఉండడంతో ఇక్కడ నిర్వహించడానికి జాతీయ అథ్లెటిక్స్ ఫెడరేషన్ అనుమతిచ్చింది.

బస, వసతి లేక..

పోటీల్లో పాల్గొనేందుకు వచ్చిన క్రీడాకారులకు బస, వసతి కల్పించకపోవడంతో వారు కొంత ఇబ్బంది పడ్డారు. పోటీల పర్యవేక్షణకు వచ్చిన టెక్నికల్ ఆఫీషియల్స్, కోచ్‌లకు మాత్రమే నిర్వాహకులు బస, భోజన వసతి కల్పించారు. అథ్లెటిక్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (ఏఎఫ్ఐ) నిబంధల ప్రకారం పోటీల్లో పాల్గొనేందుకు వచ్చిన వివిధ రాష్ట్రాలకు చెందిన అథ్లెటిక్స్‌కు మాత్రమే ఈ సౌకర్యం కల్పించలేదు. దీంతో వారంతా బయట హటళ్లు, లాడ్జీలలోనే చేస్తున్నారు. భోజనం కూడా బయటనే చేయాల్సివస్తోంది. దీనితో జేఎన్ఎస్ స్టేడియం చుట్టుపక్కల ఉన్న హోటళ్లు, లాడ్జీలు క్రీడాకారులతో నిండిపోయాయి.

జేఎన్ఎస్‌లోనే 20 కి.మీ. రేస్‌వాక్

రెండో రోజు పోటీల్లో భాగంగా శుక్రవారం స్త్రీ, పురుషులకు 20 కి.మీ. రేస్‌వాక్ నిర్వహణకు అన్ని ఏర్పాట్లు చేశారు. ఈ ఈవెంట్ జేఎన్ఎస్‌లోనే నిర్వహించాలని నిర్ణయించారు. అంతకుముందు ఈ లాంగ్ రేస్‌వాక్‌ను బయట నిర్వహించాలనుకున్నారు. ఇందుకు అనువైన రోడ్డు మార్గం కోసం అన్వేషించారు. అంతకు ముందు వరంగల్ నిట్‌లో నిర్వహించారు. కానీ అందులో ప్రస్తుతం రోడ్డు ఈఈవెంట్ నిర్వహణకు అనువుగా లేకపోవడతో బయట పలు ప్రాంతాలను పరిశీలించారు. భద్రకాళి బండ్, తదితర ప్రాంతాలను చూశారు. అవి కూడా అనువుగా లేకపోవడంతో చివరకు స్టేడియంలోనే నిర్వహించాలనే నిర్ణయానికి వచ్చారు. ఉదయం 6 గంటలకు ఈ ఈవెంట్ ప్రారంభమవుతుంది.

నేడు (శుక్రవారం) జరిగే ఈవెంట్లు

1500 మీటర్ల పరుగు, 119 మీటర్ల హర్డిల్స్ (1.067 మీటర్లు), ట్రిపుల్ జంప్ (13.00 మీటర్లు), డిస్కస్ త్రో (2.000 కేజీ), 100 మీటర్ల (0.83 మీటర్లు), 200 మీటర్ల రేస్, జావెలిన్ త్రో, 200 మీటర్ల పరుగు, పోల్‌వాల్ట్, హై జంప్, షార్ట్‌పుట్ (4.000 కేజీ), 400 మీటర్ల పరుగు, 800 మీటర్ల పరుగు, 1500 మీటర్ల పరుగు, 5000 మీటర్ల పరుగు, హామ్మర్ త్రో, 400 మీటర్ల హర్డిల్స్ ఈవెంట్లలో ఈ పోటీలు జరుగుతాయి.



పది వేల మీటర్ల పరుగు పందెంలో పాల్గొన్న అథ్లెట్లు



వంద మీటర్ల పరుగు పందెంలో క్రీడాకారిణులు









షాట్‌పుట్ విసురుతున్న అథ్లెట్లు





హై, లాంగ్ జంప్ చేస్తున్న అథ్లెట్లు

ఒలింపిక్స్‌లో పతకమే నా లక్ష్యం

10 వేల మీటర్ల రేస్‌వాక్ స్వర్ణ విజేత లతిక్ తల్వార్



లతిక్ తల్వార్

హనుమకొండ, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): 'ఒలింపిక్స్‌లో స్వర్ణ పతకం సాధించడ మే నా లక్ష్యం.. ఆ దిశగా నా పరుగు కొనసాగుతుంది..' అంటున్నారు లతిక్ తల్వార్. గురువారం హనుమకొండ జేఎన్ఎస్ స్టేడియంలో ప్రారంభమైన ఐదో జాతీయ స్థాయి అండర్ -23 అథ్లెటిక్స్ పోటీల్లో మొదటి నిర్వహించిన 10,000 మీటర్ల రేస్‌వాక్‌లో లతిక్ స్వర్ణ పతకాన్ని సాధించారు. ఈ సందర్భంగా ఆమె 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడు తూ.. 10,000 మీటర్ల రేస్‌లో స్వర్ణ పత కం గెలుచుకోవడం ఇదే మొదటి సారి అన్నారు. ఇంతకుముందు 5000 మీటర్ల రేస్‌వాక్‌లో స్వర్ణం గెలుచుకున్నానని చెప్పారు. రాజస్థాన్ రాష్ట్రంలోని తల్వార్ ఆమె స్వగ్రామం. వీరిది వ్యవసాయ కుటుం బం. క్రీడల పట్ల మక్కువ ఎక్కువ. పాఠశాలలో నిర్వహించే పరుగు పందాల్లో లతిక్ ఎప్పుడూ విజేతే. ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు ఇచ్చిన ప్రోత్సాహంతో అథ్లెటిక్‌గా అంచెలంచెలుగా రాణిస్తున్నారు. ఒలింపిక్స్‌లో భారత దేశం తరుపున పాల్గొని స్వర్ణం గెలుచుకోవం తన అంతిమ లక్ష్యమని, ఆ దిశగా మరింత శ్రమిస్తానని అన్నారు.

రెండు కొత్త రికార్డులు

100 మీటర్ల రేస్, డిస్కస్ త్రోలో సాక్షి, నిఖిత్ కుమారి ప్రతిభ

హనుమకొండ, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): ఐదో జాతీయ అథ్లెటిక్స్ ఓపెన్ అండర్ -23 పోటీల్లో అథ్లెట్లు హోరాహోరీగా తలపడుతున్నారు. కొత్త రికార్డులను సృష్టిస్తున్నారు. గురువారం తొలి రోజు జరిగిన 100 మీటర్స్, డిస్కస్‌త్రో ఈవెంట్లలో రెండు కొత్త రికార్డులు నమోదయ్యాయి.

100 మీటర్ల రేస్‌లో 2022లో జరిగిన నేషనల్స్‌లో ధనశ్రీ (బిలాస్‌పూర్) మీట్ రికార్డు 11.63 సెకండ్లు కాగా, గురువారం జరిగిన సెమిఫైనల్స్‌లో ఈవెంట్‌లో సాక్షి (రిలయన్స్) 11.62 సెకండ్లలో (ఒక సెకండ్ తేడాతో) పూర్తి చేసి కొత్త రికార్డు నెలకొల్పారు.

డిస్కస్‌త్రోలో 2024లో సన్యాయాదవ్ (హరియాణా) మీట్ రికార్డు 50.59 మీటర్స్ కాగా, గురువారం జేఎన్ఎస్‌లో జరిగిన నేషనల్స్‌లో పంజాబ్ ఎన్‌సీవోపీకి చెందిన నిఖిత్‌కుమారి 50.73 మీటర్లు (0.14 మీటర్లు ఎక్కువ దూరం) విసిరి పాత రికార్డునే బ్రేక్ చేసింది.

హైదరాబాద్‌లో ఒలింపిక్స్

- అదే సీఎం రేవంత్‌రెడ్డి లక్ష్యం
- గెలుపోటములను క్రీడా స్ఫూర్తితో తీసుకోవాలి
- వరంగల్ ఎంపీ కడియం కావ్య
- అట్టహాసంగా జాతీయస్థాయి అథ్లెటిక్స్ పోటీలు ప్రారంభం

వరంగల్ స్పోర్ట్స్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ వేదికగా ఒలింపిక్స్ క్రీడా పోటీలు నిర్వహించడమే లక్ష్యంగా సీఎం రేవంత్‌రెడ్డి కృషి చేస్తున్నారని వరంగల్ ఎంపీ కడియం కావ్య అన్నారు. తెలంగాణ అథ్లెటిక్స్ అసోసియేషన్ పర్యవేక్షణలో జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం హనుమకొండలోని జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియం (జేఎన్ఎస్)లో 5వ జాతీయస్థాయి ఓపెన్ అండర్-23 మెన్ అండ్ ఉమెన్ అథ్లెటిక్స్ పోటీలు అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. ఈ కార్యక్రమానికి ఎంపీ కావ్య ముఖ్య అతిథిగా హాజరై క్రీడా పోటీలను ప్రారంభించి మాట్లాడారు. విజన్ కలిగిన సీఎం రేవంత్‌రెడ్డికి క్రీడల పట్ల ఉన్న ఆసక్తితో రాష్ట్రంలో ఖేలో ఇండియా ద్వారా రానున్న మూడు, నాలుగు ఏళ్లలో హైదరాబాద్‌లో ఒలంపిక్స్ క్రీడా పోటీలు నిర్వహించడానికి కార్యాచరణ రూపొందించబోతున్నారన్నారు. సీఎం ఆదేశాలతో రాష్ట్రానికి చెందిన ఎంపీలు ఒలింపిక్స్ ప్రతినిధి పీటీ ఉషను కలిసి ఒలింపిక్స్ క్రీడా పోటీల నిర్వహణపై చర్చించామన్నారు. హైదరాబాద్ తర్వాత అభివృద్ధిలో ద్వితీయ స్థానంలో నిలుస్తున్న హనుమకొండలో అంతర్జాతీయ స్థాయి క్రికెట్ స్టేడియం, స్పోర్ట్స్ పాఠశాల ఏర్పాటుకు కసరత్తు పూర్తికావచ్చిందన్నారు. క్రీడల్లో గెలుపోటములు సమానంగా తీసుకోవాలని సూచించారు.

హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ మాట్లాడుతూ.. హనుమకొండ నగరంలో జాతీయస్థాయి అథ్లెటిక్స్ పోటీలు నిర్వహించడం ఎంతో సంతోషకరమన్నారు. దేశం నలు మూలల నుంచి వచ్చిన క్రీడాకారులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ప్రభుత్వం తరుపు, అథ్లెటిక్స్ అసోసియేషన్ తరుపున ఏర్పాట్లను చేసామన్నారు. మేయర్ సుధారాణి మాట్లాడుతూ.. సీఎం రేవంత్‌రెడ్డి క్రీడలకు అధిక ప్రాధాన్యమిస్తున్నారన్నారు. జేఎన్ఎస్ అభివృద్ధి కోసం జీడబ్ల్యూఎంసీ నుంచి సుమారు రూ.2కోట్ల మేర నిధులు మంజూరు చేసామన్నారు. అథ్లెటిక్స్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి సారంగపాణి మాట్లాడుతూ.. జాతీయస్థాయి అండర్-23 మెన్ అండ్ ఉమెన్ అథ్లెటిక్స్ పోటీల్లో దేశంలోని నలుమూలల, రెండు తెలుగు రాష్ట్రాలతో సహా 937 మంది అథ్లెట్లు, 135 మంది టెక్నికల్ అఫీషియల్స్, కోచ్‌లు, మేనేజర్లు పాల్గొన్నారన్నారు. మూడు రోజుల పాటు క్రీడా పోటీలు పండుగ వాతవరణంలో క్రీడాకారులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా నిర్వహిస్తామన్నారు. 10వేల మీటర్ల పరుగుపందెం, డిస్కస్‌త్రో, 100 మీటర్ల పరుగుపందెం, షాట్‌పుట్, లాంగ్‌జంప్, హైజంప్, 400 మీటర్ల పరుగుపందెం, హ్యామార్‌త్రో, పోల్‌వాల్ట్, 1500 మీటర్ల పరుగుపందెంలో తొలిరోజు క్రీడా పోటీలు నిర్వహించామన్నారు.



జాతీయస్థాయి క్రీడా పోటీల ప్రారంభ కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎంపీ కావ్య

ఈ సందర్భంగా తొలి రోజు నిర్వహించిన 10వేల మీటర్ల పరుగు పందెంలో విజయం సాధించిన అథ్లెట్లకు అతిథుల చేతుల మీదుగా మెడల్స్ ప్రదానం చేశారు. కార్యక్రమంలో అథ్లెటిక్స్ అసోసియేషన్ రాష్ట్ర చైర్మన్ ఎర్రబెల్లి వరద రాజేశ్వర్, రాష్ట్ర అధ్యక్షుడు స్టాన్లీజోన్, హనుమకొండ డీవైఎస్‌వో అశోక్‌కుమార్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మహ్మద్ అజీజ్‌ఖాన్, సీఐ పుల్యాల కిషన్, అథ్లెటిక్స్ అసోసియేషన్ బాధ్యులు పగడాల వెంకటేశ్వర్‌రెడ్డి, పి.రమేష్‌రెడ్డి, రమణ, ఊర యుగేందర్‌రెడ్డి, రామప్ప పోలీస్ అకాడమీ చైర్మన్ ఐలి చంద్రమోహన్‌గౌడ్, డీఎస్‌ఏ కోచ్ శ్రీమాన్, వివిధ జిల్లాలకు చెందిన అసోసియేషన్ సభ్యులు, మేనేజర్లు, టెక్నికల్ అఫీషియల్స్ తదితరులు పాల్గొన్నారు.

రచ్చ రచ్చ...

(5వ పేజీ తరువాయి)

నాయిని రాజేందర్‌రెడ్డితో విభేదాలు, పరకాల నియోజకవర్గంలో ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్‌రెడ్డితో విభేదాలతో గత ఏడాది దసరా మరుసటి రోజు గీసుగొండ పోలీస్‌స్టేషన్ ఎదుట మంత్రి సురేఖ ధర్నా, తదితర సంఘటనలు వివాదాస్పదంగా మారాయి.

మంత్రి పొంగులేటితో విభేదాలు

ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి, రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డితో మేడారం టెండర్ల విషయంలో తలెత్తిన విభేదాలు పార్టీలో తీవ్ర చర్చనీయాంశంగా మారాయి. మేడారం గద్దెల పునరుద్ధరణ, ప్రాకారం విస్తరణ పనుల కోసం ప్రభుత్వం రూ.101కోట్ల నిధులు కేటాయించింది. ఈ పనులను దేవాదాయశాఖకు కేటాయించారు. అయితే తన శాఖ నిధులతో చేపట్టే పనుల్లో మంత్రి పొంగులేటి పెత్తనం ఏమిటని, తనకు తెలియకుండా ఆయన సొంత కంపెనీలకు టెండర్లు ఇప్పించుకుంటున్నారని సురేఖ ఆగ్రహంతో సీఎం రేవంత్‌రెడ్డి, టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌గౌడ్‌కు ఫిర్యాదు చేశారు. మరుసటి రోజు సోమవారం మేడారంలో మంత్రి సీతక్కతో కలిసి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి జాతరపై సమీక్షి నిర్వహించారు. ఈ సమీక్షకు సురేఖకు ఆహ్వానం లేకపోవటంతో దూరంగా ఉన్నారు. దేవాదాయశాఖ మంత్రికి తెలియకుండా జాతరపై సమీక్ష నిర్వహించటంపై విమర్శలు వెల్లువెత్తాయి.

ఈ వివాదం సోషల్ మీడియాలో వైరల్ కావటంతో పాటు అధిష్ఠానం వరకు వెళ్లింది. ఈ క్రమంలోనే బుధవారం మధ్యాహ్నం 2గంటలకు సీఎం వరంగల్ పర్యటనకు వచ్చారు. నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి తల్లి కాంతమ్మ దశదిన కర్మలో సీఎం పాల్గొన్నారు. దొంతితో కొండా దంపతులకు రెండు దశాబ్దాలకు పైగా రాజకీయ వైరం ఉంది. సీఎం రేవంత్‌రెడ్డి సొంత జిల్లాకు వచ్చినప్పుడు ప్రొటోకాల్ ప్రకారం హెలిప్యాడ్ వద్ద మంత్రి సురేఖ స్వాగతం పలికి ఉండాల్సిందనే అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి. సురేఖ సీఎం పర్యటనకు దూరంగా ఉండటంతో రాజకీయంగా మరింత దుమారం రేగుతోంది.

వివాదం సద్దుమణిగేనా..?

మంత్రి కొండా సురేఖ ఎపిసోడ్ ఉమ్మడి వరంగల్‌తో పాటు రాష్ట్ర వ్యాప్తంగా సంచలనంగా మారింది. అయితే సురేఖ భర్త మాజీ ఎమ్మెల్సీ కొండా మురళి చేసిన వ్యాఖ్యలు చర్చనీయాంశంగా మారాయి. రేవంత్‌రెడ్డి తమకు మరో వైఎస్‌ఆర్ వంటి వారని, రేవంత్‌రెడ్డిని సీఎం చేసేందుకు తాను, సురేఖ కష్టపడ్డామని పేర్కొన్నారు. మరోవైపు మంత్రి సురేఖతో ఏఐసీసీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షినటరాజన్, టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తదితరులు చర్చించారు. మీనాక్షి నటరాజన్ ఫోన్‌లో సురేఖతో మాట్లాడి.. ఎలాంటి మీడియా సమావేశాలు పెట్టవద్దని సూచించారని సమాచారం. మొత్తానికి అధిష్ఠానం కూడా సురేఖతో పాటు సీఎం రేవంత్‌రెడ్డి, పొంగులేటితో చర్చించినట్లుగా ప్రచారం జరుగుతోంది. 42శాతం బీసీ రిజర్వేషన్ల కోసం పోరాడుతున్న నేపథ్యంలో బీసీ మహిళ మంత్రితో వివాదం కాంగ్రెస్ పార్టీకి తీవ్ర నష్టం జరుగుతుందని అధిష్ఠానం భావిస్తున్నట్లుగా తెలిసింది.

అన్నావదినలపై కత్తితో దాడి

- తీవ్రగాయాలతో వదిన మృతి, అన్నకు గాయాలు
- స్థల వివాదంలో ఘర్షణ
- నల్లబెల్లి మండలం కొండాపురంలో ఘటన

నల్లబెల్లి, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): స్థలం విషయంలో చెలరేగిన గొడవ కత్తిపోట్లకు దారి తీసింది. ఇంటి స్థలాన్ని పంచమని తల్లితో గొడవ పడ్డ వ్యక్తిని తమ్ముడు కత్తితో దాడిచేశాడు. అడ్డువచ్చిన వదినను కూడా పొడవడంతో ఆమె చికిత్స పొందుతూ మృతి చెందింది. అన్న తీవ్రగాయాలతో చికిత్స పొందుతున్నాడు. ఈ ఘటన బుధవారం రాత్రి చోటుచేసుకుంది. పోలీసుల, స్థానికుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి.

వరంగల్ జిల్లా నల్లబెల్లి మండలం కొండాపురం గ్రామానికి చెందిన మేరుగుత్తి సమ్మక్క - మల్లయ్య దంపతులకు ఇద్దరు కుమారులు రమేష్, సురేష్ ఉన్నారు. యేడాది కిందట పెద్ద కుమారుడు రమేష్‌కు గీసుగొండ మండలం మచ్చాపురానికి చెందిన స్వరూప(35)తో వివాహమైంది. చిన్నకుమారుడు సురేష్‌కు వివాహం కాలేదు. అయితే ఇంతకుముందే పెద్ద కుమారుడు రమేష్‌కు వివాహం కాగా భార్య చనిపోయింది. ఆయనకు ఒక కుమారుడు, కుమార్తె ఉన్నారు. అలాగే స్వరూపకు కూడా ఇదివరకే వివాహం కాగా, ఇద్ద రు కుమారులు ఉన్నా రు. వీరిద్దరు తల్లిదండ్రుల ఇంటి పక్కనే రేకుల షెడ్డులో నివసిస్తున్నారు. కాగా, రమేష్ - స్వరూప దంపతులు.. వారి సమీప బంధువు చనిపోవడంతో అంత్యక్రియలకు వెళ్లి బుధవారం రాత్రి ఇంటికి చేరుకున్నారు. ఇదే క్రమంలో తల్లి సమ్మక్క ఇంటి వద్దే ఎదురుగా కనబడడంతో రమేష్ వాగ్వాదానికి దిగాడు. ఇంటి స్థలాన్ని ఇంకా ఎప్పుడు పంచుతావని ఘర్షణకు దిగాడు. అదే సమయంలోనే రమేష్ తమ్ముడు సురేష్ ఇంటికి వచ్చాడు. గొడవ పెద్దగా కావడంతో తీవ్రమైన కోపంతో తాను ఇదివరకే ఇచ్చిన రూ.10వేలు ఇవ్వకుండా, పైగా ఇంటి స్థలాన్ని పంచమని గొడవ చేస్తావా..? అంటూ కోప్పడ్డాడు. ఆపై పక్కనే ఉన్న పందులను కోసే కత్తితో అన్న సురేష్ వీపుపై, పొట్టలో రమేష్ పొడిచాడు. ఇది గమనించిన స్వరూప అడ్డుకునేందుకు రాగా, ఆమెను కూడా ఛాతి భాగంలో కత్తితో పొడిచాడు. తీవ్ర గాయాల పాలైన దంపతులను వెంటనే కుటుంబసభ్యులు, స్థానికులు 108లో నర్సంపేటలోని ఏరియా ఆస్పత్రికి తరలించారు. అయితే స్వరూప చికిత్స పొందుతూ రాత్రే మృతి చెందగా, రమేష్ ప్రస్తుతం వరంగల్ ఎంజీఎం ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. మృతురాలి కుమారుడు శివకుమార్ ఫిర్యాదు మేరకు మేరుగుత్తి సురేష్‌పై కేసును నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించినట్లు ఎస్సై గోవర్ధన్ వెల్లడించారు.



స్వరూప (ఫైల్)



ఎంజీఎంలో చికిత్స పొందుతున్న రమేష్

ఫొటోగ్రఫీ, షార్ట్‌ఫిల్మ్, వ్యాస రచన పోటీలు : సీపీ

వరంగల్ క్రైం, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 21న పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవం పురస్కరించుకొని రాష్ట్ర పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ఔత్సాహిక ఫొటోగ్రాఫర్‌లకు ఫొటోగ్రఫీ, షార్ట్‌ఫిల్మ్, విద్యార్థులకు వ్యాసరచనలో పోటీలు నిర్వహిస్తున్నట్లు పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్‌సింగ్ తెలిపారు. ఫొటోగ్రఫీ పోటీల్లో భాగంగా పోలీసుల త్యాగం తెలిసేలా, వారి ప్రతిభను గుర్తించే ఇటీవల తీసిన 3 ఫొటోలు, షార్ట్ ఫిల్మ్‌లో భాగంగా 3 నిమిషాలు వీడియోను ఈ నెల 25వ తేదీలోపు వరంగల్ పోలీస్ కమిషనరేట్ పీఆర్‌వోకు అందజేయాలన్నారు. అదేవిధంగా వ్యాసరచనలో పోటీల్లో పాల్గొనేందుకు 6వ తరగతి నుంచి పీజీ వరకు చదివే విద్యార్థులు అర్హులని, 'డ్రగ్స్ నివారణలో పోలీసుల పాత్ర', విద్యార్థులు డ్రగ్స్ నుంచి ఎలా దూరంగా ఉండాలి' అనే అంశంపై 500 పదాలకు మించకుండా వ్యాసం రాసి ఆన్‌లైన్‌లో వ్యాసం ఫొటో కానీ, పీడీఎఫ్ ఫార్మాట్‌లోనైనా పంపించాలన్నారు. మిగతా వివరాలకు 87126 85050 నెంబర్‌లో సంప్రదించాలన్నారు.

బిల్లు చెల్లింపులో వ్యవసాయ శాఖ నిర్లక్ష్యం

- జనగామ డీఏవో కార్యాలయ సామగ్రి జప్తుకు కోర్టు ఆదేశం

జనగామ, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): ఏళ్లుగా బిల్లులు ఇవ్వడంలో నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో వ్యవసాయ శాఖ కార్యాలయ ఫర్నిచర్ జప్తుకు కోర్టు ఆదేశించింది. జనగామకు చెందిన దీప్తి ఇంజనీరింగ్, వెల్డింగ్ వర్క్స్ యజమాని కత్తుల రాజిరెడ్డి ప్రభుత్వం వ్యవసాయ యాంత్రీకరణ పథకం కింద రైతులకు అందించిన రాయితీ పనిముట్ల తయారీ కాంట్రాక్టును దక్కించుకున్నాడు. 2014-15 ఏడాది నుంచి కల్టివేటర్లు, ప్లవ్‌లు, రొటోవేటర్లు, ఇతర పనిముట్లు తయారీ చేసి జిల్లా వ్యవసాయ శాఖకు అందిస్తున్నాడు. దీనికి సంబంధించి వ్యవసాయ శాఖతో ఒప్పందం జరిగింది. కాగా, పనిముట్ల తయారీకి గాను 2016-17 ఏడాదికి సంబంధించిన బిల్లు రూ.5.25 లక్షలు వ్యవసాయ శాఖ చెల్లించాల్సి ఉంది. అప్పట్లో కేంద్ర సూక్ష్మ, చిన్నతరహా పరిశ్రమల శాఖ పరిధిలోని 'సమాధాన్' ద్వారా ఫిర్యాదు చేశారు. దీనిపై అప్పటి ఉమ్మడి జిల్లా పరిశ్రమల శాఖ అధికారులు స్పందించి వ్యవసాయ అధికారులతో మాట్లాడి బిల్లుల చెల్లింపునకు హామీ ఇచ్చారు. అయినా వ్యవసాయ శాఖ బిల్లులు ఇవ్వలేదు. దీంతో రాజిరెడ్డి జనగామ కోర్టును ఆశ్రయించారు. దీంతో స్పందించిన కోర్టు బిల్లు రూ. 5.25 లక్షలు, మూడింతల వడ్డీ రూ.13,19,428 కలిపి మొత్తంగా రూ. 18,44,928 ఇవ్వాలని ఆగస్టు 5న జిల్లా వ్యవసాయ శాఖ అధికారులను ఆదేశించింది. అయినా బిల్లు ఇవ్వకపోవడంతో జిల్లా వ్యవసాయ శాఖ కార్యాలయంలోని సామగ్రిని జప్తు చేసుకునేలా అటాచ్‌మెంట్ వారెంట్‌ను జారీ చేసింది. కాగా, కోర్టు అటాచ్‌మెంట్ వారెంట్‌తో, కోర్టు ఫీల్డ్ అసిస్టెంట్ పూల్‌చంద్‌తో కలిసి సామగ్రిని జప్తు చేసుకునేందుకు బాధితుడు రాజిరెడ్డి కలెక్టరేట్‌లోని వ్యవసాయ శాఖ కార్యాలయానికి గురువారం వచ్చారు. కాగా, జిల్లా వ్యవసాయాధికారి అంబికాసోని, కలెక్టరేట్ ఏవో శ్రీకాంత్ బాధితుడితో మాట్లాడారు. మూడు నెలల్లో బిల్లు మంజూరు చేయిస్తామని హామీ ఇవ్వడంతో బాధితుడు కత్తుల రాజిరెడ్డి అంగీకరించారు. ఈ విషయమై జిల్లా వ్యవసాయాధికారి అంబికాసోనిని వివరణ కోరగా.. తాను జిల్లాకు కొత్త కావడంతో పెండింగ్ బిల్లు విషయం తన దృష్టిలో లేదని చెప్పారు. బిల్లు చెల్లింపునకు మూడు నెలల గడువు కోరామని తెలిపారు.



ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
ములుగు
శుక్రవారం 17 అక్టోబరు 2025 8



రాజకీయాలకు అతీతంగా బీసీలు ఏకం కావాలి

ఇంటలెక్చువల్ ఫోరం చీఫ్ కోఆర్డినేటర్ వీరస్వామి, సామాజిక న్యాయ వేదిక రాష్ట్ర అధ్యక్షుడు సాంబయ్య


సమావేశంలో మాట్లాడుతున్న వీరస్వామి

ములుగు రూరల్, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): బీసీలు రాజకీయాలకు అతీతంగా ఏకం కావాల్సిన అవసరం ఏర్పడిందని బీసీ ఇంటలెక్చువల్ ఫోరం చీఫ్ కోఆర్డినేటర్ కె.వీరస్వామి, సామాజిక న్యాయ వేదిక రాష్ట్ర అధ్యక్షుడు ఏషబోయిన సాంబయ్య యాదవ్ అన్నారు. ములుగు జిల్లా కేంద్రంలోని విశ్రాంత ఉద్యోగుల భవనంలో జిల్లా బీసీ జేఏసీ నాయకుడు ముంజాల భిక్షపతిగౌడ్ అధ్యక్షతన గురువారం సమావేశం జరిగింది. ముఖ్య అతిథులుగా వీరస్వామి, సాంబయ్య యాదవ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రధాన రాజకీయ పార్టీల కుట్ర వల్లే బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు కావడం లేదని విమర్శించారు. బీసీలకు రిజర్వేషన్లు ఖరారు చేసే వరకు పోరాటాలను ఆపేది లేదన్నారు. ఇది మరో తెలంగాణ ఉద్యమంలా కొనసాగించాలని అన్నారు. బీసీలంతా ఏకతాటిపై నడిచి ప్రభుత్వాల మీద ఒత్తిడి తీసుకురావాలన్నారు. ఇందులో భాగంగా ఈ నెల 18న జరిగే బంద్‌ను విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో సీపీఐ జిల్లా కార్యదర్శి గుండెబోయిన చంద్రయ్య, సామాజికవేత్త ఎ.తిరుపతి, సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి జంపాల రవీందర్, ఎమ్మార్పీఎస్ జాతీయ కార్యదర్శి నెమలి నర్సయ్య, బీసీ సంఘాల నాయకులు ఉపేంద్ర గౌడ్, వడ్డెపల్లి సారంగపాణి, సాగర్, ముఖేష్, చక్రపాణి, వీరబాబు, తోటకూరి శ్రీకాంత్ గౌడ్, శ్యామల్ నాయక్, కోరె రవి, శ్రీనివాస్ అడ్వకేట్, వేణు, వెంకటేశ్వర్లు, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.



ఆధ్యాత్మిక చింతన కలిగి ఉండాలి

జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బుర్ర రమేష్


సినీ ఫైట్ మాస్టర్స్ రామ్, లక్ష్మణ్‌లకు భగవద్గీత అందిస్తున్న బుర్ర రమేష్

భూపాలపల్లిటౌన్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): ఆధ్యాత్మిక చింతన ప్రతి ఒక్కరికీ అవసరమని జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ బుర్ర రమేష్ అన్నారు. తీర్థయాత్రకు వెళ్లిన ఆయన పలువురికి భగవద్గీతను బహూకరించారు. పలువురు ప్రముఖులతో కలిసి పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. తిరిగి వచ్చిన సందర్భంగా రమేష్ గురువారం విలేకరులతో మాట్లాడారు. సమాజంలో రక రకాల వ్యక్తులు ఉంటారని, అందరూ జీవితంపై అవగాహనతో బతక లేరని అన్నారు. ఈ క్రమంలో మంచి చెడులను గుర్తించాలంటే ఆధ్యాత్మిక చింతనపై అవగాహన తప్పనిసరి అన్నారు. ఇందుకు భగవద్గీత పఠనం ఆవశ్యమన్నారు. మానవ మనుగడ ప్రశాం తంగా ఉండాలంటే.. ఇది తప్పనిసరి అని అన్నారు.

బిడ్డకు తల్లి పాలే శ్రేయస్కరం

కృష్ణకాలనీ, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): పుట్టిన ప్రతి బిడ్డకూ తల్లి పాలే శ్రేయస్కరమని సంక్షేమ శాఖ జిల్లా అధికారి మల్లీశ్వరి అన్నారు. పట్టణంలోని సుభాష్‌కాలనీ, రాంనగర్, ఇందిరానగర్ కాలనీల్లోని సెంటర్లలో పోషణ మాసోత్సవ కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అంగన్‌వాడీ సెంటర్‌కు పిల్లలో పాటు గర్భిణులు వచ్చి టీచర్లు అందించే పౌష్టికాహారాన్ని తీసుకోవాలని సూచించారు. అనంతరం చిన్నారులకు అన్నప్రాసన, అక్షరాభ్యాసం చేయించారు. ఈ కార్యక్రమంలో సూపర్వైజర్ రజిత, అంగన్‌వాడీ టీచర్లు వసంత, సుజాత, రమ, స్వరూప, అరుణ, ఉమామహేశ్వరి, సంధ్య, ఆయాలు శంకరమ్మ,ఆశావర్కర్లు సంగీత, దేవేంద్రతదితరులు పాల్గొన్నారు.

బీసీల బంద్‌ను విజయవంతం చేయాలి

టేకుమట్ల, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 18న బీసీ సంఘాల ఐక్యవేదిక అధ్వర్యంలో నిర్వహించనున్న బీసీల బంద్‌ను విజయవంతం చేయాలని బీసీ సంఘాల ఐక్య వేదిక మండల గౌరవ అధ్యక్షుడు నేరేళ్ల రామకృష్ణ గౌడ్ కోరారు. మండల కేంద్రంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేసి విద్యా, ఉద్యోగ, రాజకీయ రంగాల్లో లబ్ధి చేకూరేలా చూడాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా తలపెట్టిన బీసీల బంద్‌ను మండలంలోని వర్తక, వ్యాపార, వాణిజ్య సముదాయాలు స్వచ్ఛందంగా మూసివేసి సహకరించాలని కోరారు. విలేకరుల సమావేశంలో వర్తక వ్యాపార సంఘం మండల అధ్యక్షుడు బొడ్డు సదానందం, విశ్వకర్మ సంఘం మండల అధ్యక్షుడు ఆకోజు వరదాచారి, కుమ్మరి సంఘం మండల గౌరవ అధ్యక్షుడు నాపెల్లి వీరేశం తదితరులు పాల్గొన్నారు.

గణపురం ఎంఈవోగా అఫ్రోజ్

గణపురం, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): మండల విద్యాశాఖ అధికారిగా ఎం.డి.అఫ్రోజ్ నియామకమయ్యారు. గురువారం ఆయన బా ధ్యతలు స్వీకరించారు. అయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు ఎంఈ వోను ఈ సందర్భంగా సన్మానించారు. దేసు సతీష్, దూలం కుమారస్వామి, జలందర్, చంద్రమౌళి, శ్రీధర్, రఘునాథరెడ్డి, రమేష్, శ్రీను, రాంబాబు, భరత్, షకీరా బేగం, దిల్షాద్, సీఆర్‌పీ సిబ్బంది రాజేష్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

పీహెచ్‌సీలో సీపీఆర్‌పై అవగాహన

మహాముత్తారం, అక్టోబరు16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బోర్లగూడెం పీహెచ్‌సీలో సీపీఆర్‌పై గురువారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎవరికైనా హఠాత్తుగా గుండెపోటు వస్తే ప్రాణాలను ఎలా కాపాడాలో అనే ఈ ప్రక్రియ గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో వైద్యులు మమత, జ్యోతితో పాటు సిబ్బంది పాల్గొన్నారు.

పాఠశాలలో ప్రపంచ ఆహార దినోత్సవం

మహదేవపూర్, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): మహదేవపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రపంచ ఆహార దినోత్సాన్ని గురువారం నిర్వ హించారు. ఈ సందర్భంగా సీడీపీవో రాధికరెడ్డి మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలకు సమతుల్య ఆహారం అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో ప్రకాశ్ బాబు, సీడీపీవో రాధిక, హెడ్మాస్టర్ అనిల్‌కుమార్, పాఠశాల సైన్స్ ఉపాధ్యాయులు బి.ప్రభాకర్‌రెడ్డి, మడక మధు, ప్రాథమిక కేంద్రం వైద్యాధికారి సుష్మిత, సూపర్‌వైజర్లు నాగరాణి, శివరాణి, రమాదేవి, వీణ, పోషణ్ అభియాన్ బీసీ స్వప్న, చైల్డ్ కోఆర్డినేటర్ తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

ఓటరు దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలి

వీడియో కాన్ఫరెన్స్‌లో రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్‌రెడ్డి


వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్, ఆర్డీవో

ములుగు కలెక్టరేట్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): పెండింగ్‌లో ఉన్న ఓటరు దరఖా స్తులను సత్వరమే పరిష్కరిం చాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి.సుదర్శన్‌రెడ్డి అన్నా రు. గురువారం ఆయన హైదరాబాద్ నుంచి కలెక్టరేట్ కలెక్టర్ దివాకర, అధికారులతో వీడి యో కాన్ఫరెన్స్ నిర్వహించి మాట్లాడారు. బూత్ స్థాయి అధికారుల నియామకం, నూతన ఓట ర్లకు ఓటరు కార్డుల పంపిణీ, పలు అంశాలపై సూచనలు చేశారు. ఓటరు జాబితాకు సంబంధించి పెం డింగ్ దరఖాస్తులు ఎక్క డైనా ఉంటే కలెక్టర్ ప్రత్యేక శ్రద్ధ చూపి వెంటనే పరిష్క రించాలన్నారు. ఎన్నికల కమిషన్ జారీ చేసిన మార్గదర్శకాల ప్రకారం పెండింగ్ ఫారం-6, 7, 8 దరఖాస్తులకు సంబంధించి నోటీస్ పిరియడ్ జారీచేసిన ఏడు రోజుల్లోగా పరిష్కరించాలన్నారు. జిల్లాలో ప్రతీ పోలింగ్ బూత్‌కు బూత్‌స్థాయి అధికారి నియామకం పూర్తికావాలని, బీఎల్‌వోలకు ఐడీ కార్డులు జారీ చేయాలన్నారు. నూతన ఓటర్లకు ఓటర్ ఐడీకార్డుల పంపిణీ ప్రక్రియ త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో ఆర్డీవో వెంకటేశ్ పాల్గొన్నారు.

భక్తులకు ఇబ్బందులు కలగొద్దు : ఎమ్మెల్యే గండ్ర


అభివృద్ధి పనులు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే, కలెక్టర్

రేగొండ, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి) : జాతరకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తుగానే ఏర్పాట్లు పూర్తి చేయాలని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు అధికారులకు సూచించారు. మండల పరిధి తిరుమలగిరి శివారులోని బుగులోని జాతర అభివృద్ధి పనులను కలెక్టర్ రాహుల్‌శర్మ, డీఎఫ్‌వో నవీన్‌రెడ్డితో కలిసి ఎమ్మెల్యే గురువారం పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ బ్రహ్మోత్సవాలకు అధికారులు సమన్వయంతో పనిచేయా లని అన్నారు. భక్తుల సౌకర్యార్థం తాగునీరు, పారి శుధ్యం, రవాణా, పార్కింగ్, విద్యుత్, వైద్య సేవలకు సంబంధించిన పనులను సకాలంలో పూర్తి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ శ్వేత, పీఆర్ ఈఈ వెంకటేశ్వర్లు, తహసీల్దార్ శ్వేత, ఎంపీడీవో వెంకటేశ్వర్లు, జాతర చైర్మన్ గంగుల రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న ఎన్ఎస్ఎస్ శిబిరాలు

ములుగు రూరల్, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): ఎన్ఎస్ఎస్ యూనిట్-4 యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల, కాకతీయ విశ్వ విద్యాలయం ఆధ్వర్యంలో చేపట్టిన ఏడు రోజుల ఎన్ఎస్ఎస్ ప్రత్యేక శిబిరాలు కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా మండలంలోని జగ్గన్నపేట గ్రామంలో ప్రజలకు మరుగుదొడ్ల వాడకం, సురక్షితమైన తాగు నీరు, ప్లాస్టిక్ వాడకం, గృహ వ్యర్థాల తొలగింపుపై గురువారం అవగాహన కల్పించారు. ఆరోగ్యకరమైన వాతావరణం కోసం, పరిశుభ్రతను కాపాడడానికి గ్రామ ప్రజలతో మాట్లాడారు. బహిరంగ మల విసర్జన, కలుషిత నీరు వినియోగించడం ద్వారా ప్రబ లించే వ్యాధుల పట్ల, సురక్షితమైన తాగు నీటి కోసం శుద్ధీకరణ పద్ధతులపై, కంపోస్టింగ్ ఎరువు తయారీ విధానాలపై అవగాహన కలిగించారు. కార్య క్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ అజ్మీరా రమేష్ పాల్గొన్నారు.


సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

వెంకటాపురం, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వైద్యాధికారి భాస్కర్ అన్నారు. గురువారం మండలంలోని చినగంగారం, మహితాపురం గ్రామాల్లో వేర్వేరుగా వైద్య శిబిరాలు జరగగా ఆయన పాల్గొని గ్రామస్థులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. పలువురి నుంచి రక్తనమూనాలు సేకరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రజలు పరిసరాల పరిశుభ్రతతోపాటు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని అన్నారు. శిబిరాల్లో హెచ్‌ఈవో కోటిరెడ్డి, సిబ్బంది స్వప్న, రాఘవులు, తదితరులు పాల్గొన్నార

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ములుగు రూరల్, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని 33 కేవీ పత్తిపల్లి నుంచి కాసీందేవిపేట సబ్ స్టేషన్ మధ్యలో ఉన్న లైనుకు మరమ్మతుల కారణంగా శుక్రవారం విద్యుత్ సరఫరాను నిలిపివేయనున్నట్లు ములుగు ఏఈ బి.రవి ఒక ప్రకటనలో తెలిపారు. పత్తిపల్లి సబ్‌స్టేషన్ పరిధిలో ఉన్న అన్ని గ్రామాలకు ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నామని పేర్కొన్నారు.

పశువులకు గాలికుంటు నివారణ టీకాలు తప్పనిసరి


ఒడితలలో పశువులకు టీకా వేస్తున్న డాక్టర్ అజయ్.

చిట్యాల, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని అన్ని గ్రామాల్లో పశువులకు గాలికుంటు నివారణ టీకాలును తప్పనిసరిగా వేయించాలని పశు వైద్యాధికారి డాక్టర్ అప్పాని అజయ్ తెలిపారు. మండలంలోని ఒడితల, దూత్‌పల్లి గ్రామాల్లో 320 పశువులకు గురువారం టీకాలు వేసినట్లు తెలిపారు. మూడు నెలలు నిండిన గేదె, ఆవులకు తప్పని సరిగా టీకాలు వేయించాలన్నారు. ఇందుకు విడతల వారీగా అన్ని గ్రామాల్లో శిబిరాలు ఏర్పాటు చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆస్పత్రి సిబ్బంది కవిత, దివ్య, కరుణాకర్, సుజాత తదితరులు పాల్గొన్నారు.

మేడారం అభివృద్ధి పనులపై తప్పుడు ప్రచారాలు మానుకోవాలి : రవిచందర్


సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానోత్ రవిచందర్

ములుగు టౌన్, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): మేడారం జాతరలో జరు గుతున్న అభివృద్ధి పనుల గురించి ప్రతిపక్ష పార్టీలు తప్పుడు ప్రచారాలు చేయడం మానుకోవాలని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానోత్ రవి చందర్ అన్నారు. జిల్లా కేంద్రంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు చాంద్ పాషా ఆధ్వర్యంలో గురువారం ముఖ్య నాయకులతో సమావేశం ఏర్పాటు చేశారు. రవిచందర్ మాట్లాడుతూ మేడారం జాతర కోసం కొండాయి వద్ద నిర్మిస్తున్న బ్రిడ్జి పనులు ఇటీవల కురిసిన అకాల వర్షాల వల్ల పనులు కొంత ఆలస్యమయ్యాయన్నారు. జాతర సమయానికి బ్రిడ్జి పనులు పూర్తి చేసి వాహనదారులకు ఇబ్బందులు లేకుండా చేస్తామని అన్నారు. మేడారంలో శాశ్వత పనుల నిర్మాణం కోసం టెండర్లు పూర్తి చేసి పనులు ప్రారం భించారని జాతర సమయానికి ముందే పనులు పూర్తయ్యే విధంగా మంత్రి సీతక్క ఎప్పటి కప్పుడు అధికారులను అప్రమత్తం చేస్తున్నారని, జాతరకు భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కల గకుండా చర్యలు చేపడుతున్నామని అన్నారు. సమావేశంలో మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ రేగ కల్యాణి, బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు వంగ రవి యాదవ్, ములుగు పట్టణ అధ్యక్షుడు చింతనిప్పుల భిక్షపతి, పీఏసీఎస్ వైస్ చైర్మన్ మర్రి రాజు యాదవ్, కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు పల్లె జయపాల్ రెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి మునుపేపల్లి కుమార్ గౌడ్, నాయకులు నల్లెల్ల భరత్, కూనూరు అశోక్, శంకరా చారి, ఓదేలు, యూత్ నాయకులు పాల్గొన్నారు.

టెన్త్ ఫలితాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలి : డీఈవో

వెంకటాపురం, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): పదోతరగతి ఫలితాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని జిల్లా విద్యాశాఖ అధికారి సిద్ధార్థరెడ్డి ప్రధానోపాధ్యాయులకు సూచించారు. మండల కేంద్రంలోని జిల్లాపరిషత్, ప్రాథమిక పాఠశాలలను సందర్శించి విద్యార్థులతో గురువారం ఆయన మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. చిన్నారుల సామర్థ్యాలను స్వయంగా పరిశీలించారు. అనంతరం ప్రధానోపాధ్యాయులతో సమీక్ష సమావేశం నిర్వహించి పలు సూచనలు చేశారు. జిల్లాలో విద్యా రంగాన్ని అభివృద్ధిచేసి ముందుకు తీసుకెళ్తామని అన్నారు. పాఠశాలలు, విద్యారంగంలో నెలకొన్న సమస్యలను పరిష్క రిస్తా మని, జిల్లాలో డ్రాప్ అవుట్ పిల్లలను గుర్తించి వారు తిరిగి పాఠశాలలకు వచ్చేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ ఏడాది పదిలో నూరుశాతం ఉత్తీర్ణత సాధించేలా కృషి చేయాలన్నారు. అదేవిధంగా హాస్టళ్లు, మోడల్‌స్కూళ్లు, కేజీబీవీలకు గ్యాస్, కోడిగుడ్ల సరఫరా ప్రారంభమైందని తెలిపారు. సమావేశంలో ఉల్లాస్ జిల్లా కో ఆర్డినేటర్, ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

నిరుపేదలకు నిత్యావసర సరుకుల పంపిణీ

వెంకటాపురం, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలో కాఫేడ్ స్వచ్ఛంద సేవాసంస్థ ఆధ్వర్యంలో నిరుపేద కుటు ంబాలకు నిత్యావసర సరుకుల పంపిణీ గురువారం జరిగింది. ఈ కార్యక్రమంలో సీఐ ముత్యం రమేష్, తహసీల్దార్ వేణుగోపాల్‌లు ముఖ్య అతిథులుగా పాల్గొని వెంకటాపురం, వాజేడు మండలాల్లోని 350 నిరుపేద కుటుంబాలకు సరుకులు అందజేశారు. కార్యక్రమంలో సంస్థ డైరెక్టర్ లూర్ధురాజు, పీఏసీఎస్ అధ్యక్షుడు చిడెం మోహన్‌రావు, కాంగ్రెస్ నాయకుడు మురళి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు గంపా రాంబాబు, జిల్లా నాయకుడు గుడవర్తి నర్సింహమూర్తి, కోఆర్డినేటర్లు గొంది హనుమంతు, కామేష్, ప్రశాంత్, నరేష్, ప్రసాద్, భాస్కర్, రమాదేవి, ఇందిర, స్వరూప, ఉష, పద్మ, తదితరులు పాల్గొన్నారు.

మృతుల కుటుంబాలకు బీఆర్ఎస్ ఆర్థిక సాయం

ఏటూరునాగారం, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): ములుగు జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు కాకులమర్రి లక్ష్మీనర్సింహరావు (లక్ష్మణ్ బాబు) ఆదేశాల మేరకు ఇటీవల మృతి చెందిన రెండు కుటుంబాలకు, ప్రమాదంలో గాయపడిన వ్యక్తికి పార్టీ నాయకులు గురువారం ఆర్థిక సాయం అందించారు. వారంరోజుల క్రితం అనారోగ్యంతో మృతి చెందిన తాండ్ర రాములు కుటుంబానికి, అలాగే ఎమ్డీ. ముస్తఫా తల్లి ఎమ్డీ. మహరున్‌బీ కుటుంబానికి సంఘీభావం తెలుపుతూ జిల్లా నాయకులు కాకులమర్రి ప్రదీప్‌రావు మృతుల కుటుంబాలను పార్టీ నాయకులతో కలిసి పరామర్శించారు. కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు తాడూరి రఘు, సప్పిడి రాంనర్సయ్య, కాకులమర్రి భాస్కర్ బాబు, కుమ్మరి చంద్రబాబు పాల్గొన్నారు.

బలవర్ధక ఆహారం తీసుకోవాలి

ఏటూరునాగారం, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): బలవర్ధక ఆహారాన్ని తీసుకుంటే రోగాల బారిన పడకుండా జాగ్రత్తగా ఉండొచ్చని ఏటూరునాగారం ఐసీడీఎస్ సూపర్‌వైజర్ బి.వసంత అన్నారు. మండలంలోని చిన్నబోయినపల్లి సెక్టార్‌లోని దొడ్ల కొత్తూరు అంగన్వాడీ కేంద్రంలో గురువారం టీచర్ స్వూరూప రాణి ఏర్పాటు చేసిన పోషణ మాసం అవగాహన సదస్సులో ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. పోషకాహారలోపం, రక్తహీనత, మాతృ మరణాలు, శిశు మరణాలను తగ్గించడమే పోషణ మాసం ముఖ్య ఉద్దేశమని వసంత వివరించారు. అంగన్‌వాడీ టీచర్లకు క్రమశిక్షణ పెంపొందించే విధంగా ప్రీ-స్కూల్ విద్యను అందించాలని సూచించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ బి.వసంతతో పాటు చిన్నబోయినపల్లి సెక్టార్ అంగన్‌వాడీలు పాల్గొన్నారు.

అభ్యసన సామర్థ్యం పెంపొందించాలి

వాజేడు, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): విద్యార్థుల్లో అభ్యసన సామర్థ్యాన్ని పెంపొందించాలని ఎంఈవో తేజావత్ వెంకటేశ్వర్లు ఉపాధ్యాయులకు సూచించారు. మండలంలోని బిజినేపల్లి, ప్రగళ్లపల్లి, వాజేడు, మురుమూరు, మురుమూరు కాలనీ, పాఠశాలలను ఆయన గురువారం సందర్శించారు. ఉపాధ్యాయులు విద్యార్థులకు బోధిస్తున్న తీరును పరిశీలించారు. ఈ సంద ర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతీ ఉపాధ్యాయుడు టీఎల్ఎంలను ఉపయోగించాలన్నారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించేలా చర్య తీసుకో వాలన్నారు. మండలంలో ఎఫ్ఆర్ఎస్ హాజరు వంద శాతం ఉందని, విద్యార్థుల ఎఫ్ఆర్ఎస్ హాజరు 73.59 శాతంగా ఉందని తెలిపారు.

ఉపాధ్యాయ సంఘాల సమన్వయ సమావేశం

తాడ్వాయి, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాల ఆవరణలో వివిధ ఉపాధ్యాయ సంఘాల ఆధ్వర్యంలో సమన్వయ సమావేశం గురువారం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా మాజీ ఎంఈవో రేగ కేశవరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని అన్ని ఉపాధ్యాయ సంఘాల ఆమోదంతో ఉత్తమ ఉపాధ్యాయులను ఎంపిక చేసి వారిని సన్మానించడం జరిగిందన్నారు. ఈ కార్యక్ర మంలో స్థానిక ఎంఈవో గడ్డి శ్రీనివాస్, ఉపాధ్యాయ సంఘాల నాయకులు సోలం కృష్ణయ్య, పాయం మానేశ్వర్‌రావు, కొర్నిబెల్లి నారాయణరావు, సుతారి పాపారావు, ఆలెం లక్ష్మయ్య, కంది రాజు, బుజంగరావు, ఆరెం భాస్కర్, జన్ను శోభన్ తదితరులు పాల్గొన్నారు.

సెర్ప్ తాత్కాలిక ఉద్యోగుల ముందస్తు అరెస్టు

మహాముత్తారం, అక్టోబరు16 (ఆంధ్రజ్యోతి): తమ సమ్యలను పరిష్కరించాలని కోరుతూ హైదరాబాద్‌లోని ప్రధాన కార్యాలయం ముట్టడికి వెళ్తున్న సెర్ప్ తాత్కాలిక ఉద్యోగులను పోలీసులు గురువారం ముందస్తు అరెస్టు చేశారు. పోలీస్‌స్టేషన్ తరలించి సాయంత్రం వదిలేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో తమకు ఇచ్చిన హామీలను తీర్చకపోవడంతో నిరసన తెలపడానికి తాము హైదరా బాద్ బయల్దేరామని ఉద్యోగులు తెలిపారు. అక్కడి వరకు వెళ్లకుండా పోలీసులు అరెస్టు చేశారని అన్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి తమ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. తెలంగాణ రాష్ట్ర వీవోఏ జేఏసీ మండల కమిటీ సభ్యులు జాడి వెంకటయ్య, పంతకాని సూర్యనారయణ, పోచయ్య పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి క్రీడలకు ఎంపికైన విద్యార్థి

వెంకటాపూర్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జవహర్‌నగర్ మోడల్ జూనియర్ కళాశాలలో ఇంటర్ ప్రథమ సంవత్సరం చదువుతున్న గంపా పూర్ణచందర్ ఇటీవల జిల్లాస్థాయిలో జరిగిన ఎస్‌జీఎఫ్ఐ వాలీబాల్ పోటీల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయికి ఎంపికయ్యాడు. ఈ మేరకు ప్రిన్సిపాల్ మందపల్లి కృష్ణ తెలిపారు. ఈసందర్భంగా విద్యార్థిని ప్రిన్సిపాల్‌తోపాటు అధ్యాపకులు, పీఈటీ బండారు కుమార్ గురువారం అభినందించారు.

మాజీ సర్పంచ్‌కు 'సిరికొండ' పరామర్శ

గణపురం, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చెల్పూరు మేజర్ గ్రామ పంచాయతీ మాజీ సర్పంచ్ నడిపెల్లి మధుసూదన్‌రావును ఎమ్మెల్సీ సిరికొండ మధుసూదనాచారి పరామర్శించారు.

ఇటీవల మాజీ సర్పంచ్ తల్లి శారదాదేవి అనారోగ్యంతో మృతి చెందగా ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఎమ్మెల్సీ వెంట కోల రవి, దాసరి రవి, మేకల రజిత, మోహన్, రాజయ్య, శ్రీను, రాజేశ్వర్‌రావు, శంకర్, పాషా శ్రీకాంత్, శ్రీనివాస్‌రావు, దేవేందర్, శ్రావణ్ తదితరులు ఉన్నారు.

జడ్పీ మాజీ చైర్‌పర్సన్ పర్యటన

తాడ్వాయి, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): మండలంలో బీఆర్ఎస్ ములుగు నియోజకవర్గ ఇన్‌చార్జి, జడ్పీ మాజీ చైర్‌పర్సన్ బడే నాగజ్యోతి గురువారం పర్యటించారు. ఇటీవల అనారోగ్యాలతో మృతి చెందిన వారి కుటుంబాలను పరామర్శించారు. పలువురికి దశదిన కర్మ లకు ఆర్థిక సహాయం అందించారు. నార్లాపూర్‌లోని మృతుడు కట్ల శంబయ్య, తక్కళ్లగూడెం గ్రామానికి చెందిన మృతురాలు గొత్తికోయ మహిళ ఎట్టి సోని, కాల్వపల్లి గ్రామానికి చెందిన మృతుడు కొప్పుల నర్సయ్య కుటుంబాలను కలిసి సానుభూతి వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు దండుగుల మల్లయ్య, ఉపా ధ్యక్షుడు చల్ల రజనీకర్ రెడ్డి, మాజీ ఆత్మ చైర్మన్ దుర్గం రమణయ్య, జిల్లా నాయ కులు ఎట్టి జగదీష్, మాజీ సర్పంచ్‌లు గడ్డం అరుణ, చిడం బాబురావు, గుర్రం రమాసమ్మిరెడ్డి, సిద్దబోయిన్న చిన్నక్క శివరాజు, నాయకులు జీడి బాబురావు, రతన్‌సింగ్, పైడిపల్లి అశోక్, ఆలేటి ఇంద్రారెడ్డి, పత్తి గోపాల్, గోపాలపురం సతీష్, యువజన నాయకులు కోట సురేష్, కోయల కుంట్ల ప్రసాద్ చారి, సంకె ప్రణయ్, పబ్బోజు రాజు, మొక్క భాస్కర్, నరేందర్ తదితరులు పాల్గొన్నారు.